ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శనివారం 4 మే 2024





ఇక భగభగలే!

- నేటినుంచి అగ్నినక్షత్రం ప్రారంభం
- 17 జిల్లాలకు ఆరంజ్ అలెర్ట్
- మూడు రోజులు వడగాడ్పులు

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే అధకమైన ఎండవేడితో అల్లాడిపోతున్న రాష్ట్ర ప్రజానీకానికి మరో హాట్ న్యూస్. శనివారం అగ్నినక్షత్రం ప్రారంభం కానుంది. శనివారం నుండి మూడు రోజులపాటు పగటిపూట ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉంటాయని ప్రకటించిన వాతావరణ కేంద్రం.. 17 జిల్లాలకు 'ఆరంజ్ అలెర్ట్' జారీ చేసింది. ఫిబ్రవరి నెలాఖరు నుంచే రాష్ట్రంలో ఎండలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్‌లో పగటి పూట ఉష్ణోగ్రతలు అధికమయ్యాయి. ఎండవేడి భరించలేక చిన్నారులు, వృద్ధులు ఇంటి పట్టునే గడుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో శనివారం 'అగ్నినక్షత్రం' ప్రారంభమవుతోంది. ప్రతియేటా అగ్ని నక్షత్రం ఎండలు 25 రోజులపాటు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. ఆ మేరకు శనివారం ప్రారంభమయ్యే అగ్నినక్షత్రం ఈ నెల 28 వరకు ఉంటుంది. అగ్నినక్షత్రం ప్రారంభం కాకమునుపే రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రత 37.7 డిగ్రీలు దాటుతున్నాయి. రాష్ట్రంలో గురువారం 18 జిల్లాల్లో పగటిపూట ఉష్ణోగ్రత 37.7 డిగ్రీలుగా నమోదైంది. అధికంగా కరూరులో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈరోడ్‌లో 43.8 డిగ్రీలు, వేలూరులో 43.3 డిగ్రీలు, నుంగంబాక్కంలో 37.7 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. గత యేడాది అగ్నినక్షతం తీవ్రంగా ఉన్నప్పుడు మే 17న 42.4 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదైంది. ఈ పరిస్థితుల్లో ఈ యేడాది అగ్నినక్షత్రం ఎండల తీవ్రత అధికంగా ఉంటుందనే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే దక్షిణాది జిల్లాలు, పడమటి కనుమల ప్రాంతాల్లో అడపదడపా తేలిక పాటి వర్షాలు కురుస్తున్నాయి. కనుక అగ్నినక్షత్రం ఉన్న రోజుల్లోనే చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు శనివారం నుంచి ఆరో తేదీ వరకు 17 జిల్లాల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే 5 డిగ్రీలు అధికంగా నమోదవుతాయని వెల్లడించి ఆ జిల్లాలకు ఆరంజ్ అలెర్ట్ హెచ్చరికలు జారీ చేసారు. ఆ మేరకు తిరుచ్చి, తిరుప్పూరు, తిరువారూరు, తంజావూరు, నాగపట్టినం, వేలూరు, రాణిపేట జిల్లాలు సహా 17 జిల్లాల్లో మూడు రోజులపాటు ఎండలు విపరీతంగా కాస్తాయని తెలిపారు.

వర్షసూచన...

ఉపరితల ఆవర్తనం, పడమటి దిశ గాలుల్లో మార్పుల కారణంగా ఈ నెల 8 వరకు రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశోధన కేంద్రం ప్రకటించింది. నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, శని, ఆదివారాల్లో తేలిక పాటి జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లోనూ వర్షం కురుస్తుందని ఆ ప్రకటనలో తెలిపారు. ఏది ఏమైనప్పటికీ అకాల వర్షంగా కురిసే తేలికపాటి వర్షాలకు పగటి పూట ఉష్ణోగ్రతలో మార్పులు ఉండవని, కనుక అగ్నినక్షత్రం ఎండల్లో చిన్నారులు, వృద్ధులు ఇంటిపట్టునే గడపటం మంచిదని సూచించారు.

పబ్లిక్ పరీక్షలకు 40,000 మంది గైర్హాజరు

- ఇళ్లకు వెళ్లి విచారించాలని ప్రభుత్వ ఆదేశం



పెరంబూర్, మే 3: టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలకు 40,000 మంది విద్యార్థులు గైర్హాజరు కావడంపై విద్యాశాఖలో ప్రకంపనలు రేగుతున్నాయి. ఒకే ఏడాది ఇంతమంది ఎందుకు, ఎలా గైర్హాజరయ్యారని, విద్యార్థుల నిర్బంధ విద్య కోసం అమలు చేస్తున్న పథకాలు ఏ మేరకు ప్రభావం చూపుతున్నాయన్న దానిపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. అందుకే అంతమంది ఎందుకు గైర్హాజరయ్యారో ముందుగా తేల్చాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆయా విద్యార్థుల ఇళ్లకే వెళ్లి విచారణ జరపాలని ఉపాధ్యాయులను ఆదేశించింది. అంతేగాక ఆయా విద్యార్థులు కనీసం సప్లిమెంటరీ పరీక్షల్లో అయినా పాల్గొనేలా చర్యలు చేపట్టాలని కూడా స్పష్టం చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో నిర్వహించిన ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలకు 12,000 మంది, ప్లస్ వన్ పరీక్షలకు 9,500, టెన్త్ పబ్లిక్ పరీక్షలకు 17,000 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరు మధ్యలోనే చదువు వదలి వెళ్లారని ప్రాథమికంగా తేలడంతో తదుపరి చర్యలకు విద్యాశాఖ సిద్ధమైంది. ఆయా విద్యార్థులు వచ్చే సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాధికారులకు పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ప్రస్తుతం పరీక్షలు రాసి ఫెయిలైన విద్యార్థులు మరో విద్యా సంవత్సరం నష్టపోకుండా త్వరలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల్లో గైర్హాజరైన విద్యార్థులకు కూడా పాల్గొనేలా, వారి ఇళ్లకే వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచనలు జారీ అయ్యాయి.

6న ప్లస్‌టూ...10న టెన్త్ ఫలితాల విడుదల

అడయార్, మే 3: రాష్ట్రంలో ప్లస్‌టూ, పదో తరగతి పరీక్షా ఫలితాలు ముందుగా ప్రకటించినట్టుగానే వెల్లడవుతాయని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈ నెల 6వ తేదీ ప్లస్‌టూ, 10వ తేదీ టెన్త్ ఫలితాలను వెల్లడిస్తామని తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి, ప్లస్‌టూ విద్యార్థులకు మార్చి, ఏప్రిల్ నెలల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 17,32,926 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఒక్క ప్లస్‌టూ పరీక్షలకే 7,72,200 మంది హాజరయ్యారు. చెన్నై నగరంలోనే 45 వేల మంది విద్యార్థులు ప్లస్‌టూ పరీక్షలకు హాజరయ్యారు. అదేవిధంగా పదో తరగతి పరీక్షలకు తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన 9,10,024 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ రెండు పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి కావడంతో వాటి ఫలితాలను వెల్లడించేందుకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. ముందుగా ప్రకటించినట్టుగానే ఈ నెల 6వ తేదీ ప్లస్‌టూ, పదో తేదీన టెన్త్ ఫలితాలను వెల్లడించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది.

మణిపూర్‌కు వెళ్లేందుకు ఏడాదిగా సమయం లేదా...?

- మోదీని ప్రశ్నించిన చిదంబరం

పెరంబూర్, మే 3: మణిపూర్ రాష్ట్రంలో చెలరేగిన ఘటనలకు శుక్రవారంతో ఏడాది దాటిందని, కల్లోలానికి గురైన ఆ ప్రాంతానికి వెళ్లేందుకు ప్రధాని మోదీకి సమయం లేదా అంటూ మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన తన 'ఎక్స్'లో.. 2023 మే 3న మణిపూర్‌లో అల్లర్లు చెలరేగాయన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు అల్లర్లలో 219 మంది మృత్యువాతపడగా, వేలాది మంది గాయపడ్డారన్నారు. 60 వేల మంది ప్రజలు తమ ఇళ్లు విడిచిపెట్టి శిబిరాల్లో ఉంటున్నారని తెలిపారు. ఇళ్లు, ప్రార్థనా స్థలాలు ధ్వంసానికి గురయ్యాయన్నారు. మణిపూర్‌ను ఇప్పటికీ బీరేన్‌సింగ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం పాలిస్తోంది. అయితే దాని అధికారం ప్రధానంగా మైతీలు అధికంగా నివసించే ఇంపాల్ దాటి అధికారం విస్తరించలేదన్నారు. మణిపూర్ రాష్ట్రంలో శాంతి నెలకొల్పడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 335 చెల్లకుండా పోగా, ఆర్టికల్ 356 తప్పుపట్టిందని ఆరోపించారు. అసమర్థ, అపఖ్యాతి పాలైన ప్రభుత్వ పరిపాలనలో మణిపూర్ ప్రజలు బాధలు పడుతున్నారని, వారి కోసం తాను ఆవేదన చెందుతున్నట్లు చిదంబరం పేర్కొన్నారు.





ల్యాండింగ్ సమయాల్లో

విమానాలపై లేజర్ కాంతులు

- అధికారుల దిగ్భ్రాంతి
- దుండగుల ఆచూకీ కోసం దర్యాప్తు

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): చెన్నై జాతీయ, అంతర్జాతీయ విమానాశ్రయాల్లో రాత్రిపూట ల్యాండింగ్ అవుతున్న విమానాలపై ఎక్కడి నుంచో లేజర్ కాంతులు వస్తున్నట్లు అధికారులు గుర్తించారు.ఆ లేజర్‌కాంతులు వేస్తున్న దుండగుల ఆచూకీ కోసం విమానాశ్రయ పోలీసు ఉన్నతాధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. లేజర్ కాంతులు ప్రసరింపజేస్తున్న వ్యక్తుల ఆచూకీ తెలపాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. విమానాశ్రయం అర్ధరాత్రి నుండి వేకువజాము వరకు దేశ, విదేశాల నుండి వచ్చే విమానాలు వరుసగా ల్యాండిగ్ అవుతుంటాయి. ఆ సమయాల్లో ఆ విమానాలపై ఎరుపు, పచ్చ, నీలి, పసుపు రంగుల్లో లేజర్ కిరణాలు ప్రసారమవుతున్నాయి. ఆ కిరణాల కారణంగా విమానాల ల్యాండింగ్‌పై దృష్టిసారిస్తున్న పైలెట్ల కన్నులు కొన్ని సెకన్లపాటు చెదరి ప్రమాదం జరగడానికి ఆస్కారం ఉందని విమానాశ్రయ భద్రతా విభాగం అధికారులు చెబుతున్నారు. అంతే కాకుండా ఈ లేజర్ కిరణాల కారణంగా పైలెట్లు ల్యాండింగ్ చేయడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ లేజర్ కిరణాల ఇబ్బందులు అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు జరుగుతున్నాయని అధికారుల చెబుతున్నారు.

ఎక్కడి నుంచి వస్తున్నాయంటే...?

విమానాలపై పడే లేజర్ కిరణాలు ఏయే ప్రాంతాల నుంచి వస్తున్నాయో విమానాశ్రయ భద్రతా దళం అధికారులు గుర్తించారు. ఆ లేజర్ కిరణాలు పరంగిమలై, నందంబాక్కం, పల్లవంతాంగల్ ప్రాంతాల నుంచి తరచూ వస్తున్నట్లు గుర్తించారు. కొన్ని నెలల క్రితం చేపాక్ ప్రాంతం నుంచి కూడా లేజర్ కిరణాలు ప్రసరించాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో విమానాశ్రయం ఉన్నతాధికారులు శుక్రవారం ఓ బహిరంగ ప్రకటన విడుదల చేశారు. విమానాలపై లేజర్ కిరణాలను వేయడం నేరమని, కఠిన శిక్ష పడుతుందని హెచ్చరించారు. నగర వాసులు తమ ప్రాంతాల్లో ఎత్తయిన ప్రాంతాల నుంచి కానీ, బహుళ అంతస్థుల భవనాల పైనుంచి గాని లేజర్ కిరణాలు ప్రసారం చేస్తుంటే వెంటనే స్థానిక పోలీసులకు గానీ, కంట్రోలు రూం నెంబర్‌కు గాని ఫోన్ చేసి తెలపాలని, ఈ విషయంలో తమకు అన్నివిధాలా సహకరించాలని ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. విమానాశ్రయం పరిసరాల్లో నివసిస్తున్న ప్రజలు లేజర్ కిరణాలు ప్రసారం చేసేవారి గురించి సమాచారాన్ని వెనువెంటనే తెలపాలని కోరారు.

నగరంలో 500 ఎలక్ట్రిక్ బస్సులు

- త్వరలోనే రోడ్లపై పరుగులు



పెరంబూర్, మే 3: రాజధాని నగరం చెన్నైలో త్వరలో 500 ఎలక్ట్రిక్ బస్సులు నడుపనున్నట్లు రవాణా ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పరిధిలోని 8 రీజియన్లలో 10,125 మార్గాల్లో 20,260 బస్సులు నడుపుతోంది. ప్రతిరోజూ 18,728 బస్సులు నడుపుతుండగా, వారాంతపు, సెలవు రోజుల్లో అదనపు బస్సులు వినియోగిస్తోంది. ఈ బస్సుల్లో ప్రతిరోజూ 1.76 కోట్ల మంది ప్రయాణిస్తున్నారు. అందులో 7,179 సాధారణ బస్సుల్లో రోజూ 51.47 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో, డీజిల్ వ్యయం తగ్గించుకొనేందుకు ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా, నగరంలో 1,000 ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని నిర్ణయించిన రవాణా శాఖ, తొలివిడతగా 500 బస్సులు త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

లింకన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో

విజయకాంత్ స్మారక స్థలం

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే వ్యవస్థాపకుడు, దివంగత నటుడు కెప్టెన్ విజయకాంత్ స్మారక స్థలం అత్యధిక అభిమానులు సందర్శించే ప్రాంతంగా ప్రపంచ స్థాయి గుర్తింపు పొందింది. గత ఏడాది డిసెంబర్ 28న అనారోగ్యంతో కన్నుమూసిన విజయకాంత్ మృతదేహాన్ని కోయంబేడులోని డీఎండీకే ప్రధాన కార్యాలయం ప్రాంగణంలోనే ఖననం చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి రాష్ట్రం నలమూలల నుండి విజయకాంత్ స్మారక స్థలాన్ని సందర్శించేందుకు వందల సంఖ్యలో అభిమానులు, పార్టీ కార్యకర్తలు వవస్తున్నారు. వీరికి పార్టీ ఆధ్వర్యంలో అన్నదానం కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయకాంత్ స్మారక స్థలానికి లింకన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రపంచ స్థాయి గుర్తింపు ప్రకటించింది. విజయకాంత్ స్మారక స్థలాన్ని 125 రోజుల్లో 15 లక్షలకు పైగా అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు సందర్శించిన ప్రాంతంగా, అలా నివాళులర్పించేందుకు వచ్చినవారికి రోజూ అన్నదానం నిర్వహించిన స్మారక స్థలంగా లింకన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది.



కోయంబేడులోని విజయకాంత్ స్మారక స్థలం

చికెన్‌రైస్‌లో విషం కలిపి..

తాతను హతమార్చిన మనవడు

- నామక్కల్ జిల్లాలో ఘోరం



భగవతి

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమను వ్యతిరేకించాడనే కోపంతో విషం కలిపిన చికెన్ రైస్ ఇచ్చి తాతను హతమార్చిన మనవడిని పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి వివరాలిలా... నామక్కల్ సమీపం దేవరాయపురం ప్రాంతంలో భగవతి (20), అతడి తల్లి నదియా (40), తాత షణ్ముగం (67) నివసిస్తున్నారు. భగవతి ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్నాడు. గత ఏప్రిల్ 30న నామక్కల్ బస్‌స్టేషన్ సమీపంలోని హోటల్‌కు వెళ్ళిన భగవతి చికెన్ బిర్యాని తిని తల్లి, తాత కోసం రెండు చికెన్ రైస్ పొట్లాలు తీసుకుని ఇంటికి వెళ్ళాడు. దానిని తిన్నవెంటనే నదియా, షణ్ముగం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో దిగ్భ్రాంతి చెందిన కుటుంబీకులు వారిని చికిత్స నిమిత్తం నామక్కల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా, వారి నోటిలో నురుగలు కనిపించాయి. చికెన్ రైస్ తినటం వల్ల వారికి వికటించలేదని, విషం కలిపిన రైస్ తినటం వల్లే అస్వస్థతకు గురైనట్లు నిర్ధారించారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న కలెక్టర్ ఉమా, ఆహార భద్రతా విభాగం అధికారులు భగవతి చికెన్ రైస్ కొనుగోలు చేసిన హోటల్‌కు వెళ్ళి ఆహారపదార్థాల శాంపిల్స్ సేకరించి హోటల్‌కు సీలు వేయించారు. ఈ సంఘటనపై విచారణకు పోలీసులకు ఆదేశించారు. పోలీసులు రంగంలోకి దిగి భగవతిని, హోటల్ యజమాని జీవానందాన్ని అదుపులోకి తీసుకున్నారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న షణ్ముగం గురువారం రాత్రి మృతి చెందాడు. షణ్ముగం తిన్న చికెన్ రైస్ శాంపిల్స్ పరీక్షించి సేలం ప్రయోగశాల అధికారులు ఆ రైస్‌లో క్రిమిసంహారక మందు కలిపినట్లు ధ్రువీకరించారు. దీంతో పోలీసులకు భగవతిపై అనుమానం కలిగింది. వెంటనే అతడిని రహస్య ప్రదేశానికి తీసుకెళ్ళి విచారించగా చికెన్ రైస్‌లో క్రిమి సంహారక మందు కలిపింది అతడేనని తేలింది. తన ప్రేమను అంగీకరించలేదన్న కోపంతోనే తల్లిని, తాతను హత్య చేయాలని చికెన్ రైస్‌లో విషం కలిపినట్లు భగవతి వాంగ్మూలం ఇచ్చాడు. పోలీసులు అతడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఇక ఆస్పత్రిలో ఉన్న నదియాకు వైద్యులు అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు.

వాహనచోదకుల నీడ కోసం..

త్వరలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద గ్రీన్‌నెట్స్

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో అగ్నినక్షత్రం ప్రారంభం కాకమునుపే భానుడు నిప్పులు చెరుగుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు వాహనచోదకులు సిగ్నల్స్ వద్ద ఎండవేడి తట్టుకునేందుకు అనువుగా సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. ఆ మేరకు నగరంలో ప్రధాన కూడళ్లలోని ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వాహనచోదకులకు నీడ కల్పించే విధంగా 'గ్రీన్ నెట్స్' ఏర్పాటు చేయనున్నారు. ప్రతి సిగ్నల్ వద్ద వాహనచోదకులు గరిష్ఠంగా రెండు నిమిషాలపాటు వేచి ఉండాల్సి ఉంది. ఆ రెండు నిమిషాల్లో ఎండవేడి తట్టుకోలేక ద్విచక్రవాహనదారలుఉ సొమ్మసిల్లుతుంటారు. ఈ గడ్డు పరిస్థితి నుంచి వాహన చోధకులను కాపాడేందుకుగాను ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ సుధాకర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద గ్రీన్ నెట్స్ ఏర్పాటుచేయడానికి సన్నాహాలు చేపడుతున్నారు. ఇప్పటికే ఈ గ్రీన్‌నెట్స్ పథకం కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ప్రారంభమై సత్ఫలితాలిస్తుండటంతో నగరంలోనూ ఆ పథకాన్ని అమలు చేయడానికి ట్రాఫిక్ విభాగం అధికారులు సిద్ధమవుతున్నారు.



పుదుచ్చేరిలోని ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ నెట్

వీఐటీ ప్రవేశ పరీక్షా ఫలితాలు వెల్లడి

● టాప్-10 ర్యాంకర్లు వీరే



వరుస ర్యాంకర్లు రూపేందర్‌సింగ్, భాను మహేష్ చేకూరి, ఎ.వేదాంత్, ఆయుషి బైద్, శాన్వి సింగ్, అభిరాజ్ రమాకాంత్ యాదవ్, చైతన్య రమేష్, విక్కీ కుమార్ సింగ్, సోహాన్ హజ్రా, సాహిల్

అడయార్, మే 3: వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎలిజిబిలిటీ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (వీఐటీఈఈఈ) ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. గత నెల 19 నుంచి 30వ తేదీ వరకు దేశంలో 125 కేంద్రాలతో పాటు ఆరు దేశాల్లో ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 'వీటీ-2024' పేరుతో నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షా ఫలితాలను "https://ugresults.vit.ac.in/viteee' పోర్టల్‌తో పాటు "www.vit.ac.in' వెబ్‌సైట్‌లో కూడా విడుదల చేశారు. ఈ పరీక్షా ఫలితాల్లో హర్యానాకు చెందిన రూపేందర్ సింగ్ మొదటి ర్యాంకు దక్కించుకున్నాడు. అలాగే, రెండో ర్యాంకు రాజస్థాన్‌కు చెందిన భాను మహేష్ చేకూరి, మూడో ర్యాంక ఎ.వేదాంత్ (ఆంధ్రప్రదేశ్), నాలుగో ర్యాంకు ఆయుషి బైద్ (అస్సాం), ఐదో ర్యాంకు శాన్వి సింగ్ (ఉత్తరప్రదేశ్), ఆరో ర్యాంకు అభిరాజ్ రమాకాంత్ యాదవ్ (మహారాష్ట్ర), ఏడో ర్యాంకు చైతన్య రమేష్ (ఉత్తరాఖండ్), ఎనిమిదో ర్యాంకు విక్కీ కుమార్ సింగ్(ఉత్తరప్రదేశ్), తొమ్మిదో ర్యాంకు సోహాన్ హజ్రా (హిమాచల్ ప్రదేశ్), పదో ర్యాంకు సాహిల్ (బీహార్) సాధించారు. లక్ష లోపు ర్యాంకులు సాధించిన ర్యాంకర్లు వీఐటీ గ్రూపు విద్యా సంస్థలైన వీఐటీ వేలూరు, వీఐటీ చెన్నై, వీఐటీ ఆంధ్రప్రదేశ్, వీఐటీ భోపాల్ క్యాంపస్‌ల్లో బీటెక్ కౌన్సెలింగ్‌కు అర్హులు. మే 7 నుంచి 10వ తేదీ మధ్య జరిగే తొలి దశ కౌన్సెలింగ్‌లో 1 నుంచి 20వేల ర్యాంకుల వారు పాల్గొనవచ్చు. మే 18 నుంచి 21వ తేదీల మధ్య జరిగే రెండో దశ కౌన్సెలింగ్‌లో 20001 నుంచి 45 వేల ర్యాంకులు వచ్చిన విద్యార్థులు, మే 29 నుంచి జూన్ ఒకటో తేదీ మధ్య జరిగే మూడో దశ కౌన్సెలింగ్‌లో 45001 నుంచి 70 వేల ర్యాంకులు వచ్చిన ర్యాంకర్లు, జూన్ 9 నుంచి 12వ తేదీల మధ్య జరిగే నాలుగో దశ కౌన్సెలింగ్‌కు 70001 నుంచి లక్ష లోపు ర్యాంకులు వచ్చిన విద్యార్థులు హాజరుకావచ్చు. ఐదో దశ కౌన్సెలింగ్ జూన్ 20 నుంచి 23వ తేదీల మధ్య నిర్వహించనున్నారు. ఈ కౌన్సెలింగ్ తర్వాత జూలై రెండో వారంలో తరగతులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. వీఐటీ ప్రవేశ పరీక్షలో టాపర్లుగా నిలిచిన ర్యాంకర్లకు ఉపకారవేతనం కూడా అందజేయనుంది. ఒకటి నుంచి పది లోపు ర్యాంకులు పొందిన విద్యార్థులకు వంద శాతం ట్యూషన్ ఫీజు మినహాయిస్తారు. 11 నుంచి 50లోపు ర్యాంకులు వచ్చిన వారికి 75 శాతం, 51 నుంచి 100లోపు ర్యాంకులు వచ్చిన వారికి 50 శాతం, 101 నుంచి 500 ర్యాంకులు వచ్చిన వారికి 25 శాతం ట్యూషన్ ఫీజు మినహాయింపు ఇస్తామని వీఐటీ విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది.

18 మంది జిల్లా విద్యాధికారుల నియామకాలు రద్దు

● మద్రాసు హైకోర్టు

పెరంబూర్, మే 3: గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ఎంపిక చేసిన 18 మంది జిల్లా విద్యాధికారుల పోస్టుల నియామకాలు రద్దు చేసిన మద్రాసు హైకోర్టు, సక్రమంగా రిజర్వేషన్ల విధానం పాటించి కొత్త నియామకాలను నాలుగు వారాల్లోగా చేపట్టాలని ఉత్తర్వులు జారీచేసింది. నగరానికి చెందిన నిర్మల్‌కుమార్ సహా ఐదుగురు మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... 2020లో టీఎన్‌పీఎస్సీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 18 జిల్లా విద్యాధికారి పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించారు. వాటిలో నాలుగు పోస్టులు ఉపాధ్యాయులకు, మిగిలిన 14 పోస్టులు జనరల్ విభాగానికి కేటాయించారు. రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి ర్యాంకులు విడుదల చేసిన తరుణంలో, అందులో రిజర్వేషన్ల విధానం సక్రమంగా పాటించకుండా నియామకాలు చేపట్టారు. ముఖ్యంగా, అధిక మార్కులు వచ్చిన వెనుకబడిన తరగతులకు సముచిత రిజర్వేషన్లు కల్పించలేదు. కావున, తగిన రిజర్వేషన్ విధానాన్ని అనుసరించి కొత్త జాబితా విడుదల చేసేలా సెలక్షన్ బోర్డును ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ కేసు విచారించి 2020లో జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల్లో, నియామకాలు తుది తీర్పుకు కట్టుబడి ఉంటాయని న్యాయస్థానం పేర్కొంది. ఈ క్రమంలో, ఈ కేసు తుది విచారణ న్యాయమూర్తి ఆర్ఎన్.మంజుల శుక్రవారం విచారించింది. ఆ సమయంలో పిటిషనర్ల తరఫున హాజరైన న్యాయవాది జి.శంకరన్... జిల్లా విద్యాధికారుల నియామకంలో సరైన రిజర్వేషన్ పాటించలేదని, ఎక్కువ మార్కులు సాధించి వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు జనరల్ కేటగిరీలో సీట్లు కేయించలేదని, కావున జాబితా రద్దు చేయాలని వాదించారు. అనంతరం న్యాయమూర్తి. 2020లో వెలువరించిన జిల్లా విద్యాధికారుల పరీక్ష జాబితాను రద్దు చేయాలని ఆదేశించారు. సరైన రిజర్వేషన్ విధానం అనుసరించి నాలుగు వారాల్లో సవరించిన జాబితా ప్రచురించాలని టీఎన్‌పీఎస్సీని న్యాయమూర్తి ఆదేశించారు.

సమాచార దర్శిని

నేడు కృష్ణగాన సభలో 'చిత్తిరై ఇసై తిరువిళ'

అడయార్, మే 3: కళారంజని చారిటబుల్ ట్రస్ట్, కళారంజని స్కూల్ ఆఫ్ మ్యూజిక్ ఆధ్వర్యంలో తమిళ్ న్యూ ఇయర్ మ్యూజికల్ అండ్ అవార్డు ప్రదానోత్సవంతో పాటు 'చిత్తిరై ఇసై తిరువళ' శనివారం జరుగనుంది. స్థానిక టి.నగర్‌లోని శ్రీకృష్ణ గానసభ (మినీ హాలు)లో సాయంత్రం 6 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుంది.ఈవేడుకలను ముఖ్యఅతిథిగా శాంతి సురేష్, ప్రముఖ ఆడిటర్ జయరామన్ బాలసుబ్రమణియన్, ఉమా బాల సుబ్రమణియం,సీఆర్ లవకుమార్, తమిళనాడు తెలుగు పీపుల్ సొసైటీ చైర్మన్ రాజు దేవరకొండ తదితరులు పాల్గొంటారని నిర్వాహకులు డాక్టర్ జే.శ్రీనిబాబు, ఆర్.రాజలక్ష్మి సంయుక్తంగా ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఓపెన్ వర్సిటీ ఫలితాల విడుదల

ఐసిఎఫ్, మే 3: తమిళనాడు సార్వత్రిక విశ్వవిద్యాలయ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఈ వర్సిటీలో యూజీ, పీజీ, డిప్లొమో కోర్సులు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు జనవరి, ఏప్రిల్‌లో జరిగాయి. మార్కుల వివరాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో విడుదల చేశారు.

కోవై నుంచి ఊటీకి 25 ప్రత్యేక బస్సులు

ఐసిఎఫ్, మే 3: కోయంబత్తూర్ నుంచి ఊటీకి శనివారం నుంచి 25 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రవాణా శాఖ తెలిపింది. నీలగిరికి వచ్చే పర్యాటకులను ఆకర్షించేలా ప్రతి ఏటా వేసవి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది వేసవి ఉత్సవాలు ఈ నెల 10వ తేది ఊటీ బొటానికల్ పార్కులో పుష్ప ప్రదర్శనతో ప్రారంభమై 20వ తేది వరకు జరుగనున్నాయి. ఈ ప్రదర్శనకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం కోయంబత్తూర్ నుంచి 25 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రవాణా సంస్థ అధికారులు తెలిపారు.

తాంబరం నుంచి జీటీ ఎక్స్‌ప్రెస్

పెరంబూర్, మే 3: రైలుమార్గాల్లో మరమ్మతుల కారణంగా నెం.12615/12616 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-న్యూ ఢిల్లీ-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ మధ్య నడిచే గ్రాండ్ ట్రంక్ (జీటీ) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9వ తేదీ నుంచి చెన్నై సెంట్రల్ బదులుగా తాంబరం నుంచి బయల్దేరనుంది. ఆ ప్రకారం తాంబరంలో సాయంత్రం 5 గంటలకు బయల్దేరే జీటీ ఎక్స్‌ప్రెస్ 5.30 గంటలకు చెన్నై ఎగ్మూర్, 8.38 గంటలకు గూడూరు చేరుకుంటుందని, ఈ మార్పు మూడు నెలల వరకు ఉంటుందని దక్షిణ రైల్వే తెలియజేసింది.

జూలై 6 నుంచి 9 రోజుల పాటు భారత్ గౌరవ్ యాత్ర

అడయార్, మే 3: ఐఆర్‌టీసీ ఆధ్వర్యంలో జూలై 6వ తేదీ నుంచి తొమ్మిది రోజుల భారత్ గౌరవ్ పర్యాటక యాత్ర ప్రారంభంకానుంది. ఈ పర్యాటక రైలు కోవిల్ పట్టి, విరుదునగర్, మదురై, తిరుచ్చి, తంజావూరు, కుంభకోణం, మైలాడుదురై, చిదంబరం, చెన్నై మీదుగా కాశి, త్రివేణి సంగమం (ప్రయాగ్‌రాజ్), గయ, అయోధ్య వంటి పుణ్యస్థలాలకు చేరుతుంది.ఒక వ్యక్తికి రూ.18,550 ప్రయాణచార్జీ వసూలుచేస్తారు.పూర్తి వివరాలకు 90031 40739, 82879 32070, 90031 40680 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించి తెలుసుకోవచ్చు. ఈ రైలు లో స్లీపర్ క్లాస్, ఏసీ సౌకర్యంతో హోటళ్లలో బస, సౌత్ ఇండియన్ శాఖాహార భోజనం ప్యాకేజీ కిందకే వర్తిస్తాయని ఐఆర్‌టీసీ విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది.

దుబాయ్‌కి విమాన సేవలు రద్దు

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): దుబాయ్, అబుదాబీలో మళ్లీ కుండపోత వర్షాలు కురుస్తుండటంతో చెన్నై విమానాశ్రయం నుంచి ఆ రెండు దేశాలకు వెళ్లాల్సిన విమానాలను రెండో రోజు రద్దు చేసినట్లు విమానాశ్రయ ఉన్నతాధికారులు ప్రకటించారు. గురువారం దుబాయ్, అబుదాబీలో వర్షాలు కురవటంతో చెన్నై నుంచి వెళ్లాల్సిన విమానాలను రద్దు చేశారు. ఇదే విధంగా శుక్రవారం ఆ రెండు దేశాల నుండి రావాల్సిన విమానాలు, చెన్నై నుంచి వెళ్లాల్సిన విమానాలు రద్దయ్యాయి. దీనితో ఆ రెండు దేశాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పురస్కారం

ఐసిఎఫ్, మే 3: రాష్ట్రప్రభుత్వం అందజేయనున్న పురస్కారానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ నెల 20వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్రంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి ఉత్తమ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆరు విభాగాల్లో ప్రభుత్వం పురస్కారాలు అందజేయనుంది. ఆసక్తి ఉన్న వారు 'పేంటీఎన్' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులు పరిశీలించి అర్హులైన వారిని, సంస్థలను ఎంపిక చేయనున్నామని వృత్తుల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

రేపటి నుంచి చదురగిరికి భక్తుల అనుమతి

పెరంబూర్, మే 3: పశ్చిమ కనుమల కొండల ప్రాంతం చదురగిరిలో వెలసిన సుందర మహాలింగం ఆలయానికి నాలుగు రోజులు భక్తులను అనుమతించనున్నట్లు అటవీ శాఖ ప్రకటించింది. ఈ ఆలయంలో చిత్తిరై మాస ప్రదోషం, పౌర్ణమి సందర్భంగా ఆదివారం నుంచి ఈ నెల 8వ తేది వరకు నాలుగు రోజులు భక్తులను కొండపైకి అనుమతించనున్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులకు ఆలయానికి వెళ్లేందుకు కొండ మార్గంలోకి అనుమతిస్తామని, భక్తులు రాత్రి వేళ ఆలయం, పరిసర ప్రాంతాల్లో బస చేయరాదని, అగ్ని ప్రమాదాలకు దారి తీసే వస్తువులు తీసుకెళ్లరాదని, ఎండ తీవ్రత దృష్ట్యా వృద్ధులు, పిల్లలు కొండ ఆలయానికి రావద్దు సహా పలు సూచనలతో అటవీ శాఖ ప్రకటన విడుదల చేసింది.

నేడు పుళల్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్యారీస్, మే 3: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పుళల్ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. సూరపట్టు, సైకిల్ షాప్, నాగప్ప ఎస్టేట్, కావాంగరై, గాంధీ మెయిన్ రోడ్డు, శక్తివేల్ నగర్, కన్నప్పస్వామి నగర్, మహవీర్ గార్డెన్, తిరునీలకంఠర్ నగర్, రెడ్‌హిల్స్ అంబత్తూర్ రోడ్డు, పుళల్ సెంట్రల్ జైల్, వినాయకపురం, మెట్రోవాటర్ కార్యాలయం, రెడ్‌హిల్స్ మార్కెట్, వండిమేడు, పాలయత్తమ్మన్ ఆలయ వీధి, భజన కోయిల్ వీధి, ఇందిరా గాంధీ రోడ్డు, బాలగణేశ్ నగర్, పాడియనల్లూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

టీఎన్‌పీఎస్సీ ద్వారా 1,163 మంది ఎంపిక

పెరంబూర్, మే 3: టీఎన్‌పీఎస్సీ ద్వారా పలు ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులకు 1,163 మందిని ఎంపిక చేశారు. తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ద్వారా మార్చి 8 నుంచి ఏప్రిల్ 30వ తేది వరకు గ్రూప్-1 విభాగంలో 94 మంది, గ్రూప్-2లో 47 మంది, ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ సబ్సిడరీ చేర్చిన పోస్టులకు 851 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. గ్రూప్-5ఎ సచివాలయ పోస్టులకు 165 మందిని ఎంపిక చేశారు. ఆ ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు 1,163 మంది ఎంపికయ్యారు.

పూండి జలాశయానికి రూ.2 కోట్లతో కొత్త తూము

ఐసిఎఫ్, మే 3: నీటి లీకేజీ అరికట్టేందుకు పూండి జలాశయానికి రూ.2 కోట్లతో కొత్త తూము ఏర్పాటుచేయనున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు. నగరానికి తాగునీరందించే పూండి రిజర్వాయర్‌లో మిగులు జలాలు విడుదల చేసేందుకు 18 తూములున్నాయి. 2,9 షట్టర్లకు ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేదు. ఇసుకలో కూరుకుపోవడంతో ధ్వంసమైన ఈ షట్టర్ల నుండి నీరు లీకవుతోంది. వాటి స్థానంలో కొత్త తూముల ఏర్పాటుకు రూ.2 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. షట్టర్లు సిద్ధంగా ఉన్నాయని, త్వరలో వీటిని అమర్చనున్నామని అధికారులు తెలిపారు.

ఎమిషన్ సర్టిఫికెట్‌కు వీడియో, ఫొటో తప్పనిసరి

ఐసిఎఫ్, మే 3: ఎమిషన్ సర్టిఫికెట్ పొందేందుకు వీడియో, ఫొటో తప్పనిసరిగా అందజేయాలని రవాణా కమిషనర్ షణ్ముగసుందరం ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ 13వ తేది వాహన పొగ పరిశోధన కేంద్రాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించి, 50 కేంద్రాల్లో అవకతవకలకు జరుగుతున్నట్లు గుర్తించారు. వీటిని అడ్డుకొనేలా 'పీయూసీసీ 2.0 వర్షన్' అనే మొబైల్ యాప్ పరిచయం చేశారు. ఈ యాప్ వాహనాల పొగ పరిశోధన కేంద్రం నుంచి 30 మీటర్ల పరిధిలో మాత్రమే పనిచేస్తుంది. పొగ పరిశోధన సమయంలో రెండు ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఒకటి వాహన రిజిస్ట్రేషన్ నెంబరు స్పష్టంగా చూపించేలా, మరొకటి పొగ పరిశోధన కేంద్రం నేమ్ బోర్డును సూచించేలా తీయాల్సి ఉంటుంది. అలాగే, వీడియో నమోదు కూడా అప్‌లోడ్ చేయాలి. వీటిని అప్‌లోడ్ చేయకుంటే యాప్ వినియోగించేందుకు వీలు కాదని, అప్‌లోడ్ చేసిన వారికే సర్టిఫికెట్ డౌన్‌లోడ్ చేసుకొనేలా, ప్రింట్ తీసుకొనేలా సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

200 వార్డుల్లో మహిళా జిమ్‌లు

ఐసిఎఫ్, మే 3: నగరంలోని 200 వార్డుల్లో ఆధునిక మహిళా జిమ్‌లు త్వరలో ఏర్పాటుచేయనున్నట్లు చెన్నై కార్పొరేషన్ అధికారులు తెలిపారు. గత ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన కార్పొరేషన్ బడ్జెట్‌లో రూ.10 కోట్లతో మహిళలకు ప్రత్యేకంగా జిమ్‌లు ఏర్పాటుచేయనున్నట్లు మేయర్ ప్రియ ప్రకటించారు. ఆ ప్రకారం, ఏర్పాటుకానున్న ఈ జిమ్‌లలో ట్రెడ్ మిల్, సైక్లింగ్, ఈఎఫ్ఎక్స్ యంత్రాలు, హైడ్రాలిక్ వెయిట్ లిఫ్టింట్ మెషీన్ వంటి ఉపకరణాలు, టాయిలెట్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించనున్నామని అధికారులు తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు

ప్యారీస్, మే 3: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని, పరీక్షలకు హాజరుకాని విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ప్రకటన విడుదల చేసింది. 'నేర్చుకుందాం' పథకం కింద సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు వారాంతపు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల్లో అధిక మార్కులు పొంది ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ తరగతుల్లో మెళకువలు నేర్పుతారు. పబ్లిక్ పరీక్షల ఫలితాలు వెల్లడి అనంతరం డిగ్రీ టీచర్ల ద్వారా సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యే ముందు రోజు ఈ తరగతులు కొనసాగుతాయి.

అలల్లో చిక్కుకొని యువకుడి మృతి

పెరంబూర్, మే 3: స్థానిక కోవలం బీచ్‌కు వెళ్లిన యువకుడు అలల్లో చిక్కుకొని మృతిచెందాడు. పెరంబూర్‌కు చెందిన కార్తీక్ (27), భార్య, స్నేహితులతో కలసి గురువారం కోవలం బ్లూ బీచ్‌కు వెళ్లాడు. అందరూ సముద్రతీరంలో స్నానాలు చేస్తుండగా, ఆ సమయంలో వచ్చిన భారీ అలకు కార్తీక్ కొట్టుకుపోయాడు. సమీపంలోని జాలర్లు సముద్రంలో గాలించి స్పృహతప్పి ఉన్న కార్తీక్‌ను రక్షించి తిరుపోరూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కిలంబాక్కం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.


వైభవంగా కుంభాభిషేక వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న శక్తి అమ్మ

వేలూరు, మే 3: ఆనైకట్టు డివిజన్ అత్తియూర్ గ్రామంలోని పేంబు మారియమ్మన్ శక్తి పీఠంలో శుక్రవారం మహా కుంభాభిషేకం జరిగింది. కార్యక్రమంలో భాగంగా గో పూజ, యాగశాల పూజలు, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం విమాన గోపుర కలశాలకు కుంభాభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుమలైకోడి శక్తి అమ్మ పాల్గొని వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వేలూరు, మే 3: మానవ హక్కుల సంఘం, వాసన్ ఐ కేర్ ఏషియన్ యూత్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఇడయన్‌సాత్తు గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి టి.గణేశ్‌కుమార్, పద్మనాభన్, మణిమోహన్ సారథ్యం వహించగా, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు రాశి దళిత్‌కుమార్ పాల్గొని శిబిరం ప్రారంభించారు. శిబిరం ఏర్పాట్లను దీప శివకుమార్, మహిళా ఉప సెక్రటరీ విశ్వనాథన్, రాష్ట్ర జాయింట్ జనరల్ సెక్రటరీ ప్రేమ్ అన్నాదొరై, రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీ విజయ్ తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలు, మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

రూ.2.5 కోట్ల కోసం యువకుడి కిడ్నాప్

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్ ప్రాంతానికి చెందిన యువకుడిని గుర్తు తెలియిన వ్యక్తులు కిడ్నాప్ చేసుకెళ్లారు. అతడిని విడిచిపెట్టేందుకు రూ.2.5 కోట్లు చెల్లించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ట్రిప్లికేన్‌కు చెందిన షాహుల్ హమీద్ అనే యువకుడు తరచూ విదేశాలకు వెళ్లి అక్కడి స్మగ్లర్ల నుంచి విలువైన వస్తువులను తీసుకొచ్చి నగరంలోని వ్యక్తులకు అప్పగించి కమిషన్లు తీసుకుంటాడు. ఇటీవల షాహుల్ హమీద్ విదేశాల నుంచి తెచ్చిన వస్తువులను స్మగ్లర్లు తెలిపిన వ్యక్తులకు ఇవ్వకుండా మాయమయ్యాడు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు షాహుల్ హమీద్‌ను కిడ్నాప్ చేశారు.. షాహుల్ హమీద్ భార్యకు కిడ్నాపర్లు ఫోన్ చేసి రూ.2.5 కోట్లు చెల్లిస్తే విడిచిపెడతామని లేకుంటే చంపుతామని బెదరించారు. ఈ విషయాన్ని షాహుల్ హమీద్ భార్య ట్రిప్లికేన్ పోలీసుకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

రూ.49 లక్షల విలువైన బంగారం స్వాధీనం

పెరంబూర్, మే 3: దుబాయ్ నుంచి వచ్చిన విమానంలో అక్రమంగా తరలిస్తున్న రూ.49 లక్షల విలువైన బంగారాన్ని మదురై విమానాశ్రయంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విమానంలో బంగారం అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో కస్టమ్స్ అధికారులు, ఆ విమాన ప్రయాణికులను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. విమానంలో ప్రయాణించిన నాగపట్టణానికి చెందిన మహమ్మద్ అబూబకర్ లో దుస్తుల్లో దాచిన 812 గ్రాముల బంగారం గుర్తించి స్వాధీనం చేసుకొని అతడిని విచారిస్తున్నారు. అలాగే, మలేసియా రాజధాని కౌలాలంపూర్ నుంచి తిరుచ్చికి ఎయిర్ ఏసియా విమానంలో వచ్చిన ముగ్గురు ప్రయాణికుల నుంచి రూ.16.17 లక్షల విలువైన 235 గ్రాముల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

విల్లుపురం స్ట్రాంగ్ రూమ్‌లో మొరాయించిన సీసీ కెమెరాలు

పెరంబూర్, మే 3: విల్లుపురం అరింజర్ అన్నా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో విల్లుపురం లోక్‌సభ నియోజకవర్గంలో వినియోగించిన ఈవీఎంలు భద్రపరిచారు. ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ లోపల, బయట, కళాశాల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలతో పాటు మూడెంచెల పోలీసు భద్రత కల్పించారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం 9.28 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌లోని సీసీ కెమెరాలు హఠాత్తుగా ఆగిపోయాయి. స్ట్రాంగ్ రూమ్ వద్ద ఉన్న అభ్యర్థుల ఏజెంట్లు ఈ విషయాన్ని అధికారులకు తెలియజేయడంతో, టెక్నీషియన్లతో అక్కడకు చేరుకున్న అధికారులు 9.56 గంటలకు కెమెరాలను పునరుద్ధరించారు. యూపీఎస్ నుంచి విద్యుత్ సరఫరా ఆగిపోయిందని, దానిని సరిచేశామని ఎన్నికల అధికారి పళని వివరణ ఇచ్చారు.

20,830 మెగావాట్లకు చేరిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, మే 3: రాష్ట్ర విద్యుత్ వినియోగం తారస్థాయికి చేరింది. ఎండ తీవ్రత అధికం కావడంతో విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోంది. గత నెల 30వ తేది రాష్ట్ర విద్యుత్ వినియోగం 20,701 మెగావాట్లకు చేరింది. ఈ నేపథ్యంలో, గురువారం మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటలకు వరకు విద్యుత్ వినియోగం 20,830 మెగావాట్లకు చేరింది. శనివారం నుంచి అగ్ని నక్షత్రం ప్రారంభం కానున్న నేపథ్యంలో, విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశముందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

శశికళ తొలగింపు వ్యవహారం... సుప్రీంకోర్టులో అన్నాడీఎంకే కేవియట్ పిటిషన్

పెరంబూర్, మే 3: అన్నాడీఎంకే నుంచి శశికళను తొలగించిన తీర్మానానికి సంబంధించి అన్నాడీఎంకే తరుపున సుప్రీంకోర్టులో మళ్లీ కేవియట్ పిటిషన్ దాఖలైంది. తీర్మానానం చెల్లుతుందనే ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ అప్పీలు పిటిషన్ వేస్తే తమ వాదనలు కూడా వినాలని పిటిషన్‌లో కోరారు. అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తనను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ శశికళ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. హైకోర్టు ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ శశికళ సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లనున్నారనే సమాచారంతో అన్నాడీఎంకే కేవియట్ పిటిషన్ దాఖలుచేసింది.

కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం



ట్రోఫీ అందజేస్తున్న ఆరోగ్యశాఖ అధికారి శివకుమార్

వేలూరు, మే 3: విరుదంబట్టు అంబేడ్కర్ క్రీడా సంఘం ఆధ్వర్యంలో 54వ వార్షిక కబడ్డీ పోటీలు జరిగాయి. 60 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో వాణియంబాడి పల్లవన్ జట్టు మొదటి బహుమతి, కేకే బ్రదర్స్ సెంజి జట్టు రెండవ బహుమతి, కాట్పాడి ఎస్ఎం బ్రదర్స్ జట్టు మూడో బహుమతి గెల్చుకున్నాయి. విజేతలకు వేలూరు కార్పొరేషన్ ఆరోగ్య శాఖ అధికారి శివకుమార్ ప్రదానం చేశారు.

ఆలయ వేడుకల్లో చీపుర్లతో కొట్లాట



చీపుర్లతో కొట్టుకుంటున్న భక్తులు

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా ఆండిపట్టి సమీపంలోని మరవపట్టి ముత్తాలమ్మన్ ఆలయ చిత్తిరై ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఆ ఊరిలో బావ, మరదలు వరుసైన యువతీ యువకులు బురదలో ముంచిన చీపుర్లతో కొట్టుకున్నారు. ప్రతియేటా ఈ ఆలయంలో వింత పద్ధతుల్లో గ్రామస్థులు మొక్కుబడులు తీర్చుకుంటారు. పెళ్లీడు యువతులు వారి బావ, లేదా బావ వరసైన ఇతర బంధువులను గుడి దగ్గరకు తీసుకెళ్లి బురదలో ముంచిన చీపుర్లతో కొట్టుకుంటారు. ఇలా చేయడం వల్ల యువతలకు వివాహ భాగ్యం కలుగుతుందని గ్రామస్థుల ప్రగాఢ నమ్మకం.

నెంబర్ ప్లేట్లపై స్టిక్కర్ల వ్యవహారం

● 427 మందికి రూ.2 లక్షల జరిమానా

ప్యారీస్, మే 3: వాహనాల నెంబర్ ప్లేట్లపై స్టిక్కర్లు అంటించిన 427 మందికి రూ.2 లక్షలు జరిమానా విధించినట్లు నగర ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. రాజధాని నగరంలో పలువురు తమ వాహనాలకు మీడియా, పోలీసు, లాయర్, కార్పొరేషన్ తదితర పేర్లతో స్టిక్కర్లు అతికించడం ఎక్కువైంది. దీనిపై పోలీసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో పలువురు నకిలీ స్టిక్కర్లు అతికించినట్లు తెలిసింది. ఈ చర్యలను నివారించేలా నగరంలో గురువారం నుంచి నెంబర్ ప్లేట్లపై స్టిక్కర్లు అంటించిన వారికి పోలీసులు జరిమానా విధిస్తున్నారు. గురువారం ఒక్కరోజే 427 మందిపై కేసు నమోదుచేసి వారి నుంచి జరిమానాగా రూ.2,13,500 వసూలుచేశారు. ఈ చర్యలు రెండవ రోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి తొలి సారి పట్టుబడిన వారికి రూ.500, రెండవ సారి పట్టుబడిన వారికి రూ.1,500 జరిమానా విధిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని ఇద్దరు ఆటో డ్రైవర్ల మృతి

ప్యారీస్, మే 3: కాంచీపురంలో లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ఆటో డ్రైవర్లు సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. చిన్న కాంచీపురానికి చెందిన దయాళన్, పెద్ద కాంచీపురానికి చెందిన కుమార్ మిత్రులు. వీరు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గురువారం దయాళన్ ఆటోలో కుమార్ వెనుక సీట్లో కూర్చొని కాంచీపురం బస్టాండ్‌కు బయల్దేరారు. వారు వేగావతి జంక్షన్‌లో మలుపు తిరుగుతుండగా ఎదురుగా వచ్చిన లోడు లారీ ఆటోను ఢీకొంది. ఇందులో మిత్రులిద్దరూ తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాలు స్వాధీనం చేసుకొని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

మందుల దుకాణంలో రూ.8 లక్షల చోరీ

ప్యారీస్, మే 3: స్థానిక పుళల్ సమీపం వినాయకపురంలోని మందుల దుకాణంలో చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు రూ.8 లక్షలు దోచుకొని పరారయ్యారు. గురువారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై మందుల దుకాణం యజమాని సెంథిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసిన పోలీసులు, శుక్రవారం ఉదయం దుకాణాన్ని పరిశీలించారు. వేలిముద్ర నిపుణులు దుకాణంలో వేలిముద్రలు సేకరించారు. దుకాణంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

మూడు గుర్తుతెలియని మృతదేహాలు స్వాధీనం

ప్యారీస్, మే 3: సేలం జిల్లా చిన్నాలంపట్టి సమీపంలో ఉన్న ఫ్లై ఓవర్ కింద కుళ్లిన స్థితిలో ఉన్న గుర్తుతెలియని మూడు మృతదేహాలను శుక్రవారం ఉదయం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఫ్లై ఓవర్ సమీపంలో దుర్వాసన వస్తోందని ఆ ప్రాంతంలోని మామిడి తోట యజమాని రాజరత్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, మూడు మృతదేహాలు స్వాధీనం చేసుకొని సేలం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విచారణలో, మృతదేహాలలో రెండు పురుషులు, ఒక మహిళదని, వారి ఆచూకీ కోసం విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మేట్టూరు డ్యాంలో సేద్యం పనులు ప్రారంభం



పన్నవాడి ప్రాంతంలో ట్రాక్టర్‌తో చదును చేస్తున్న రైతు

పెరంబూర్, మే 3: మేట్టూరు డ్యాంలో నీటిమట్టాలు తగ్గడంతో పరీవాహక ప్రాంతాల్లో రైతులు సేద్యం పనులు చేపట్టారు. మేట్టూరు డ్యాం నిర్మాణ సమయంలో ఆ ప్రాంతంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలను ఖాళీ చేయించి ఇతర ప్రాంతాలకు తరలించారు. కొత్త ప్రాంతాలకు వెళ్లిన వారు కూడా తమ పాత ప్రాంతాల పేరుతోనే గ్రామాల పేర్లు ఏర్పాటుచేసుకున్నారు. 15 వేల హెక్టార్ల విస్తీర్ణంతో 120 అడుగులున్న మేట్టూరు డ్యాం నీటిమట్టం 53 అడుగులకు తగ్గిన సమయంలో తాము వదిలివెళ్లిన భూముల్లో రైతులు సాగు చేసుకుంటారు. ప్రస్తుతం డ్యాం నీటిమట్టం తగ్గడంతో కూనాండియూర్, కీరకారనూరు, పన్నవాడి, కోటయూర్, ధర్మపురి జిల్లా నాగమరై, ఓట్టనూరు ప్రాంతాల్లో రైతులు భూమిని చదును చేస్తూ సేద్యం ప్రారంభించారు.

సీమంతానికి వెళ్తూ రైలు నుంచి జారిపడి గర్భిణి మృతి



కస్తూరి (ఫైల్ ఫొటో)

పెరంబూర్, మే 3: సీమంతం కోసం స్వగ్రామానికి వెళ్తున్న గర్భిణి రైలు నుంచి జారిపడి మృతిచెందిన ఘటన విషాదం నింపింది. తెన్‌కాశి జిల్లా మేల్‌నీలితనల్లూర్ గ్రామానికి చెందిన సురేష్‌కుమార్ నగరంలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. సురేష్‌కుమార్‌కు పెరియార్ నగర్ త్రిశూలం ప్రాంతానికి చెందిన కస్తూరితో తొమ్మిది నెలల క్రితం వివాహమైంది. ప్రస్తుతం కస్తూరి 7 నెలల గర్భిణి. ఈ నేపథ్యంలో, మేల్‌నీలితనల్లూర్ గ్రామంలో జరుగనున్న ఆలయ వేడుకలకు నిర్ణయించిన ముహూర్తంలోనే స్వగ్రామంలో ఆదివారం కస్తూరికి సీమంతం చేయాలని నిర్ణయించుకొని సురేష్‌కుమార్ బంధువులకు ఆహ్వానాలు పంపాడు. నగరం నుంచి కొల్లంకు కుటుంబసభ్యులతో సురేష్‌కుమార్ బయల్దేరాడు. ఎస్-9 బోగీలో ప్రయాణిస్తున్న కస్తూరికి వాంతులు రావడంతో, ఆమె తలుపు పక్కన నిలబడి, తల బయటకు పెట్టి వాంతి చేసుకుంటున్న సమయంలో హఠాత్తుగా ఆమె కాలు జారి కిందపడిపోయింది. దీనిని గమనించిన కుటుంబసభ్యులు 'అత్యవసర చైన్' లాగేందుకు యత్నించగా అది పనిచేయకపోవడంతో పక్క బోగీకి వెళ్లి చైన్ లాగారు. అప్పటికే రైలు సంఘటన జరిగిన ప్రాంతం నుంచి 8 కి.మీ వెళ్లిపోయింది. రైల్వే పోలీసులు, కుటుంబసభ్యులు సుమారు 3 గంటలు గాలించి కస్తూరి మృతదేహాన్ని గుర్తించి బోరున విలపించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఐదు కిలోల గంజాయితో యువకుడి అరెస్ట్

ప్యారీస్, మే 3: స్థానిక అంబత్తూర్ ప్రాంతంలో చట్టవిరుద్ధంగా గంజాయి విక్రయించిన వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు, అతడి నుంచి ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అంబత్తూర్ రాకీ థియేటర్ సమీపంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ అశోకన్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం విచారణ చేపట్టింది. ఆ ప్రాంతంలో బ్యాగుతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. తిరుముల్లైవాయల్‌కు చెందిన ధనుష్ (25) ఆంధ్ర రాష్ట్రం అనకాపల్లిలో కొనుగోలు చేసిన గంజాయి రైలు ద్వారా నగరానికి తరలించి విక్రయిస్తున్నట్లు తెలుసుకొని, బ్యాగులో ఉన్న గంజాయి స్వాధీనం చేసుకొని అతడిని అరెస్ట్ చేశారు.

కొప్పనాపట్టిలో ఉత్సాహంగా సాగిన చేపలు పట్టే వేడుకలు



చెరువులో చేపలు పడుతున్న గ్రామస్తులు

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): పుదుక్కోట జిల్లా పొన్నమరావతి పరిసర ప్రాంతాల్లో వరి పంట కోతలు ముగిసిన తర్వాత వేసవిలో ఎండిపోయేందుకు సిద్ధంగా ఉన్న చెరువులు, వాగుల్లో కులమతలాలకు అతీతంగా గ్రామస్తులు చేపలుపట్టే వేడుకలు నిర్వహిస్తారు. ఆ మేరకు గురువారం ఉదయం కొప్పనాపట్టి గ్రామం వద్దనున్న చెరువులో గ్రామస్థులంతా పోటీపడి చేపలుపట్టే వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామస్తులంతా కలిసి పట్టుకున్న చేపలను ఇళ్లకు తీసుకుని వండుకుని ఆరగించారు.



వేలూరు పాత బస్టాండ్‌లో డీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినచలివేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత, మాజీ మా నగర సెక్రటరీ మహమ్మద్ సఖీ తదితరులు

వనితలకు కాదేదీ అసాధ్యం....

జ్యోతిష్యంలో మహిళా రత్నం

● లంకా వెంకటలక్ష్మి

తరుణి



లంకా వెంకటలక్ష్మి

ప్రాచీన కాలం నుంచి నేటికీ ఆదరణ పొందుతున్న ప్రాచీన శాస్త్రాల్లో జ్యోతిష్యం కూడా ఒకటి. భారతీయుల జీవితాలకు జ్యోతిష్య శాస్త్రంతో విడదీయరాని అనుబంధం ఉంది. ఆధునిక కాలంలో కూడా ఎందరో జ్యోతిష్యం నేర్చుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పురుషులతో పోలిస్తే జ్యోతిష్యం నేర్చుకునే మహిళల సంఖ్య తక్కువే. జ్యోతిష్యం గురించి తెలుసుకోవాలన్న కుతూహలంతో, కూలంకషంగా అధ్యయనం చేయాలన్న పట్టుదలతో ఆ శాస్త్రంలో పీహెచ్‌డీ వరకు ఎదిగిన మహిళామణి లంకా వెంకటలక్ష్మి. చెన్నైలో 30 సంవత్సరాల పాటు నివసించి, ఇటీవలే హైదరాబాదుకు మారిన ఆమె, వృత్తిపరంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి చెన్నై వస్తుంటారు. ఆమె చెన్నై వచ్చిన నేపథ్యంలో, ఆమెతో జరిపిన ముఖాముఖి....

- వేళచ్చేరి

? మీకు జ్యోతిష్యం చదవాలన్న కోరికకు ప్రేరణ

! నేను జ్యోతిష్యంలో పీహెచ్‌డీ చేశాను. ఇంకా ఆ డిగ్రీ చేతికి రావాలి. నాకు జ్యోతిష్యంపై ఆసక్తి కలగడానికి, నేను దానిని అధ్యయనం చేయడానికి కారణం మా పిల్లలు. మాకు ఇద్దరు అబ్బాయిలు. బాల్యంలో వారికి ఆటలపై ఆసక్తి ఎక్కువ. ఒకానొక సమయంలో వారు చదువులో పైకి వస్తారో, రారో అన్న అపనమ్మకం, భయం నాలో వెంటాడేది. ఫలితంగా నేను వారి చదువు గురించి జ్యోతిష్యులను సంప్రదించడం జరుగుతుండేది. నేనే జ్యోతిష్యం చదివితే జ్యోతిష్యుల దగ్గరికి వెళ్లే అవసరం ఉండదు కదా అనిపించింది. అంతేకాదు. మా మామ సేకరించిన జ్యోతిష్య గ్రంథాలు కూడా ఇంట్లో ఉండేవి. అవి చదువుతూనే నాకూ శాస్త్రీయంగా జ్యోతిష్యం అభ్యసించాలన్న కోరిక కలిగింది. జ్యోతిష్య పఠనానికి శ్రీకారం చుట్టాను.



భర్తతో...

? మీ పుట్టుక, విద్యాభ్యాసం

! నేను పుట్టింది ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలిలో. పెరిగింది, చదువుకున్నది విజయవాడలో. బి.ఏ వరకు అక్కడే చదివాను. వివాహానంతరం చెన్నై వచ్చాను. చెన్నైలోనే జ్యోతిష్య ప్రవీణ, జ్యోతిష్య విశారద పూర్తిచేశాను. ఆపైన పీహెచ్‌డీ చేసాను.. జ్యోతిష్యానికి అనుబంధమైన కోర్సులు కూడా హైదరాబాదులో ప్రముఖ జ్యోతిష్యుల దగ్గర చేశాను.

? వృత్తి, అనుభవం, మీ ప్రత్యేకతలు

! నేను జ్యోతిష్యాన్ని వృత్తిగా స్వీకరించి 12 సంవత్సరాలు అయింది. అయితే, అంతకు ముందు కూడా హాబీగా ఎందరికో జ్యోతిష్యం చెబుతూ అనుభవం సంపాదించాను. ' షణ్ముగ ఆస్ట్రాలజీ' పేరుతో హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో జ్యోతిష్యాలయం నిర్వహిస్తున్నాను. అంతే కాకుండా కొన్ని కంపెనీలో కూడా పనిచేస్తున్నాను. వాటి ద్వారా విదేశాల్లో ఉన్న వారికి కూడా జ్యోతిష్య విషయాల్లో సలహాలిచ్చే అవకాశం కలిగింది. భక్తి టీవీలో కొన్ని నెలలు పనిచేశాను. కానీ ప్రయాణంలో చాలా సమయం వెచ్చించాల్సి రావడంతో ఇంటికి వచ్చే క్లయింట్స్‌తో మాట్లాడడానికి, కంపెనీ పనులు చేయడానికి సమయం సరిపోక ఇబ్బంది కలిగేది. అందుకే కొన్ని నెలల తర్వాత టీవీలో పనిచేయడం మానాయాల్సి వచ్చింది. ఇంకా ఆన్‌లైన్‌లో జ్యోతిష్యం నేర్చుకునే వారికి, విద్యార్థులకి క్లాసులు తీసుకుంటాను.

? మీ ఇతర ఆసక్తులు

! నాకు సమయాన్ని వృథాగా గడపడం నచ్చని విషయం. ఏ కాస్త విరామం దొరికినా, వీణా వాదం అభ్యాసం చేస్తాను. విజయవాడలో చాలా సంవత్సరాలు వీణ నేర్చుకున్నాను. ప్రదర్శనలు కూడా ఇచ్చాను. మద్రాసు వచ్చాక ప్రఖ్యాత వైణికులు దివంగత చిట్టిబాబు దగ్గర వీణావాదనలో మెళుకువలు నేర్చుకున్నాను. మా కుమారుల దగ్గర కంప్యూటర్ గురించి తెలుసుకొని ఆన్‌లైన్‌లో అన్నీ చేయగల సమర్థత సాధించాను. ప్రయాణాలు చేయడం, స్నేహితులతో గడపడం కూడా చాలా ఇష్టమయిన విషయాలు. పాక శాస్త్రంలో కూడా ఆసక్తితో పాటు ప్రావీణ్యం కూడా ఉంది.

? మీ కుటుంబం

! లంకా వాసుదేవ్ నా జీవన సహచరుడు. ఆయన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో పనిచేసి పదవీవిరమణ చేశారు. మాకు ఇద్దరు అబ్బాయిలు. ఇద్దరూ ఉన్నత చదువులు చదివి అమెరికాలో స్థిరపడ్డారు.



అందుకున్న పురస్కారంతో...

? మీరు అందుకున్న పురస్కారాలు, అవార్డులు

! చాలా సంస్థల నుంచి సన్మానాలు, పురస్కారాలు అందుకున్నాను. జ్యోతిష్యంలో రెండు బంగారు పతకాలు సాధించాను. సృజన ఆర్ట్ క్రియేషన్స్ వారి నుంచి 'ప్రతిభా పురస్కారాన్ని' దివంగత మాజీ గవర్నర్ రోశయ్య చేతుల మీదుగా అందుకోవడం మర్చిపోలేని అనుభూతి. 'జ్యోతిష్య భూషణ్', 'జ్యోతిష్య రత్న', 'జ్యోతిష్య కీర్తి', 'జ్యోతిష్య విభూషణ్' మొదలైనవి నేను అందుకున్న బిరుదులలో కొన్ని.

? మిమ్మల్ని ఎక్కువగా ఏ విషయాల గురించి సంప్రదిస్తుంటారు

! ఎక్కువగా విద్య, వృత్తి, వివాహం, జాతకాలు, వాస్తు, విదేశీయానం, ముహూర్తాలు తదితరాలు గురించి సంప్రదిస్తుంటారు.

? ఒకవేళ ఆరోగ్య పరిస్థితులు, వివాహం మొదలైన విషయాల్లో ప్రతికూల పరిస్థితుల గురించి చెప్పాల్సి వస్తే, ఎలా స్పందిస్తారు



రోశయ్య నుంచి పురస్కారం అందుకుంటూ...

! కొన్ని సార్లు అలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. కానీ వారికి ప్రత్యక్షంగా ఆ విషయాలు చెప్పి నిరాశ, నిస్పృహలకు లోను చేయకూడదు కదా! అందుకని పరిస్థితి తీవ్రతను గురించి హెచ్చరించి, అనునయంగా కొన్ని పరిష్కారమార్గాలను సూచిస్తుంటాను. జాగ్రత్త వహించమని కోరుతుంటాను.

? తోటి మహిళలకు ఇచ్చే సందేశం ఇస్తారు

! జ్యోతిష్యం కూడా ఒక చదువే. కాబట్టి స్త్రీలు ఈ శాస్త్రాన్ని అభ్యసించడానికి సంకోచించనక్కరలేదు. అయితే చేసే పని నిబద్ధతతో చేయాలి. శ్రద్ధ, ఆసక్తులతో చేస్తే మహిళలు కూడా ఈ రంగంలో ఎన్నో విజయాలు సాధిస్తారు. స్త్రీ శక్తికి ఎదురులేదు.

'అరణ్మనై-4'లో తమన్నా - రాశీఖన్నా గ్లామర్ డోస్



తమన్నా - రాశీఖన్నా

సుందర్ సి దర్శకత్వంలో ఖుష్బూ నిర్మించిన చిత్రం 'అరణ్మనై-4'. హీరోయిన్లుగా తమన్నా, రాశీఖన్నా నటించారు. సుదర్.సి హీరో. హీరో చెల్లిగా తమన్నా నటిస్తే, వైద్యురాలిగా రాశీఖన్నా కనిపించింది. శుక్రవారం విడుదలైన ఈ చిత్రం కడుపుబ్బ నవ్వించే చిత్రంగా ఉందని ప్రేక్షకలు కామెంట్స్ చేస్తున్నారు. యోగిబాబు, వీటీవీ గణేష్ లకుతోడు మొట్టై రాజేంద్రన్ హాస్యం ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తున్నారు. తమిళంలో 'అరణ్మనై-4' పేరుతో ఈ చిత్రాన్ని రూపొందించగా తెలుగులో 'బాక్' పేరుతో రిలీజ్ చేశారు. సాధారణంగా ఒక చిత్రాన్ని రెండు లేదా మూడు భాగాలుగా తీస్తారు. కానీ, ఒక సినిమాను నాలుగు భాగాలుగా తెరకెక్కించడం చాలా అరుదని సినీ ప్రముఖులు అంటున్నారు. సుందర్ సి దర్శకత్వంలో 'అరణ్మనై' తొలి భాగం 2014లో రాగా, రెండో భాగం 2016, మూడో భాగం 2021లో రాగా, ఇపుడు నాలుగో భాగాన్ని రిలీజ్ చేశారు. గతంలో రాఘవ లారెన్స్ నటించిన 'కాంచన' చిత్రం, సూర్య నటించిన 'సింగం' మూడు సిరీస్‌లు వచ్చాయి. ఈ సినిమాలన్నీ సూపర్‌హిట్ అయ్యాయి. ఇపుడు వచ్చిన 'అరణ్మనై-4' కూడా పాజిటివ్ టాక్ రావడంతో చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేస్తుంది.

'స్టార్' జీవితానికి దగ్గరగా ఉంటుంది

● హీరో కవిన్

'స్టార్' చిత్రం తన జీవితానికి ఎంతో దగ్గరగా ఉంటుందని, ఈ సినిమాలోని అనేక అంశాలు తన నిజ జీవితంలో ఎదురైన, ఎదుర్కొన్న అంశాలేనని ఆ చిత్ర హీరో కవిన్ అన్నారు. రైజ్‌ఈస్ట్ ఎంటర్‌టైన్మెంట్, శ్రీవేంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్లపై ఇళన్ దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్, శ్రీనిధి సాగర్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'స్టార్'. అదితి పోహకంర్, ప్రీతి ముకుందన్ హీరోయిన్లుగా నటించగా, గీత కైలాసం, లాల్ ఇతర పాత్రలు పోషించారు. కెమెరా ఎళిల్ అరసు, సంగీతం యువన్ శంకర్ రాజా. ఈ నెల 10వ తేదీ విడుదలకానున్న ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా చిత్ర బృందం నగరంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో హీరో కవిన్ మాట్లాడుతూ, 'ఈ స్టోరీ మూడు గంటల పాటు ఆలకించిన తర్వాత చిత్రంలో నటించేందుకు ఓర్పు ఎంతో ముఖ్యమని గ్రహించాను. పైగా ఎక్కువ రోజులు సినిమాకు పని చేయాల్సి ఉంటుందని తెలుసుకున్నారు. సినిమా యూనిట్ అంతా ఎంతో శ్రమించాం. ఈ సినిమా విడుదలైన ఘన విజయం సాధించాలి. ఒక సాధారణ యువకుడు... సినిమా హీరో కావాలని పరితపిస్తాడు. అతని లక్ష్యం నెరవేరిందా? లేదా? అన్నదే ఈ చిత్ర కథ. దర్శకుడు ఇళన్ మాట్లాడుతూ, 'తాను ఎంతో ఎమోషనల్‌కు గురవుతున్నాను. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక కల, లక్ష్యం ఉంటుంది. ఆ కలను నిజం చేసుకునే దిశగా సాగే ప్రయాణమే 'స్టార్'. ఈ ప్రయాణంలో మనం ఏ ఒక్కరినీ బాధపెట్టకూడదు. ప్రేమతో ఆ లక్ష్యాన్ని చేరుకోవాలి. 1980 నేపథ్యంలో సాగే కథలో నటుడు కావాలన్న లక్ష్యంతో 20 యేళ్ళ యువకుడు మదురై నుంచి చెన్నైకు వస్తాడు. అతని కల నిజమైందా లేదా అన్నదే వెండితెరపై చూడాలి' అని వివరించారు.



మీడియా సమావేశంలో చిత్ర బృందం

'ఒరునొడి' దర్శకుడికి కారు బహుమతి

ఇటీవల తమన్ కుమార్ హీరోగా మణివర్మన్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'ఒరునొడి'. ఈ చిత్రం విడుదలైన మొదటి షో నుంచి ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్‌తో విజయవంతంగా ప్రదర్శితమవుతుంది. రోజు రోజుకూ ఈ చిత్రాన్ని ప్రదర్శించే స్క్రీన్ల సంఖ్య కూడా పెంచుతున్నారు. కలెక్షన్లు కూడా ఆశాజనకంగానే ఉన్నాయి. వైవిధ్యభరితమైన సస్పెన్స్ థ్రిల్లర్ జానర్‌లో ఈ సినిమా తెరకెక్కించారు. సుదీర్ఘకాలంగా సరైన బ్రేక్ కోసం చూస్తున్న మణివర్మన్‌కు ఈ చిత్రం విజయం ఎంతో ఊరటనిచ్చింది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాతలు అళగర్ మూవీస్ అళగర్, వైట్‌ల్యాంప్ పిక్చర్స్ కేజీ రతీష్ కలిసి దర్శకుడు మణివర్మన్‌కు కారు బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ చిత్రాన్ని విడుదల చేసిన నిర్మాత ధనుంజయన్ కూడా పాల్గొన్నారు.



నిర్మాత నుంచి కారు అందుకున్న దర్శకుడు

శ్రీకాంత్ - పూజిత జంటగా హాస్యభరిత చిత్రం



శ్రీకాంత్ - పూజిత పొన్నాడ

చిత్రజ్యోతి

గణపతి ఫిలిమ్స్ పతాకంపై శ్రీకాంత్ - పూజిత పొన్నాడ జంటగా నటించిన చిత్రం 'కొంచెం కాదల్.. కొంచెం మోదల్'. కె.రంగరాజ్ దర్శకత్వంలో పూర్తి హాస్యభరితంగా రూపొందింది. గతంలో 'ఉన్నై నాన్ సందిత్తేన్', 'ఉదయగీతం', 'ఉయిరే ఉనక్కాగ', 'నినైవే ఒకు సంగీతం' వంటి సిల్వర్ జూబ్లీ చిత్రాలకు దర్శకత్వం వహించిన కె.రంగరాజ్ చాలాకాలం తర్వాత కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చి దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. రెండో హీరోయిన్‌గా నిమి ఇమ్మానువేల్ నటించారు. భార్గవ్, నంబిరాజన్, కేఆర్ విజయ, ఢిల్లీ గణేష్, నస్సు, నళిని, పరుత్తివీరన్ సుజాత, సింగంపులి, రమేష్ ఖన్నా తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ఈ చిత్రం గురించి దర్శకుడు కె.రంగరాజ్ మాట్లాడుతూ, 'జీవితంలో డబ్బే ప్రధానం కాదని, జీవితంలో వేర్వేరు కోణాలుంటాయని తెలియజెప్పేలా కథ సాగుతుంది. ఇందులో క్లైమాక్స్‌లో వచ్చే సన్నివేశాలను నిజంగానే గ్లైడర్ ఉపయోగించి చిత్రీకరించారు.. ఆ సీన్స్ తెరపై అద్భుతంగా కనిపించడమేకాకుండా హాస్యభరితంగా ఉంటాయి. ఖచ్చితంగా ఈ సీన్లను ప్రేక్షకులు ఎంతగానో ఇష్టపడతారు. చెన్నై, కొడైక్కనాల్ తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ పూర్తి చేశాం' అని వివరించారు.

ఎస్కేపీడీలో వైభవంగా వసంతోత్సవం



విశేషాలలంకారంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

ప్యారీస్, మే 3 : స్థానిక జార్జి టౌన్‌లోని కన్యకాపరమేశ్వరీ దేవస్థానం (ఎస్కేపీడీ)లో వాసవీ వసంతోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజైన శుక్రవారం అమ్మవారు బంగారు కేడము అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు. ఈ ఆలయంలో ఈ నెల 5 నుండి 7 వరకు వాసవీ తెప్పోత్సవం, 15 నుండి 17 వరకు లక్షార్చన, 18న జయంతి మహోత్సవం నిర్వహించనున్నారు. వసంతోత్సవం సందర్భంగా ప్రతి రోజూ సాయంత్రం ఆరుగంటలకు కళాకారులచే భక్తి సంగీత కార్యక్రమాలు, అమ్మవారి జన్మవిశేషాలతో ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పళని ఆలయంలో 16 నుంచి వయ్యాశి విశాఖ ఉత్సవాలు



చెన్నై, మే 3 (ఆంధ్ర జ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం సుబ్రహ్మణ్య స్వామివారి ఆరుదివ్యక్షేత్రాల్లో తృతీయ క్షేత్రమైన పళని దండాయుధపాణి ఆలయంలో ఈ నెల 16న వయ్యాశి విశాఖ ఉత్సవాలు ప్రారంభమవుతున్నారు. పది రోజులపాటు అత్యంత వైభవంగా ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ నెల 16న పళని పెరియనాయకి అమ్మవారి ఆలయంలో ఉదయం ధ్వజారోహణంతో ఈ వేడుకలు ప్రారంభమవుతాయి. ఉత్సవాల్లో ప్రతి రోజూ వళ్లి, దేవసేన సమేతుడైన ముత్తుకుమారస్వామి వారికి సప్పరం, దంతాల పల్లకీ, తోళుక్కినియాళ్, స్వర్ణ అశ్వం, రజత మయూరం, స్వర్ణ మయూరం తదితర వాహనాల్లో ఆలయ వీధుల్లో ఊరేగించనున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధానఘట్టమేనతిరుకళ్యాణోత్సవం 21న నిర్వహించనున్నారు. మరుసటి రోజు సాయంత్రం 4.30 గంటలకు వయ్యాశి విశాఖ రథోత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవాలు జరిగే పది రోజులూ పెరియనాయకి అమ్మవారి ఆలయంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు, భరతనాట్యం, భక్తి సంగీత కచేరి తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ మారిముత్తు, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేష్ నాయకత్వంలో అధికారులు, ఆలయ నిర్వాహకులు సమావేశమై ఉత్సవాల్లో పాల్గొనేందుకు రానున్న భక్తులకు కల్పించాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.



స్నాతకోత్సవంలో గవర్నర్, ప్రముఖులు

బీఐఎం క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన

అడయార్, మే 3: తిరుచ్చిలోని భారతీదాసన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (బీఐఎం) కొత్త క్యాంపస్ నిర్మాణానికి గవర్నర్ ఆర్ఎన్.రవి శంకుస్థాపన చేశారు. ఈ యూనివర్సిటీ 32వ స్నాతకోత్సవ వేడుకలు తాజాగా జరుగ్గా 36, 37 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులకు గవర్నర్ రవి ముఖ్య అతిథిగా హాజరై డిగ్రీ పట్టాలు అందజేశారు. ఆ తర్వాత కొత్త ప్రాంగణం నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీవీఎస్ మోటార్ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్, బీఐఎం డైరెక్టర్ అసిస్ట్ బర్మా, బీఐఎం రవి అప్పాస్వామి, బీఐఎం మాజీ ఛైర్మన్ రమేష్ గెల్లి, బీఐఎం బోర్డ్ ఆఫ్ గవర్నర్లు బాల భాస్కర్, సతీష్ పరాశరన్, డాక్టర్ కామకోటి, డాక్టర్ ఆర్‌కే రాఘవన్, అన్నా విశ్వవిద్యాలయం డాక్టర్ ఆర్ వేల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీనిక్స్ మార్కెట్‌సిటీ మాల్‌లో 'నేచురల్స్' స్టోర్

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలోని ఫీనిక్స్ మార్కెట్ సిటీ మాల్‌లో నేచురల్స్ స్టోర్ ప్రారంభమైంది. ప్రముఖ నటి నిక్కీ గల్రానీ, నటులు అతుల్యా రవి, సునీల్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి తదితరులు ఈ స్టోర్ లాంఛనంగా ఇటీవల ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ సహ వ్యవస్థాపకుడు సీకే కుమారవేల్ మాట్లాడుతూ... బ్యూటీ అండ్ సెలూన్ పరిశ్రమలో 24 సంవత్సరాల అనుభవంతో, ఫీనిక్స్ మార్కెట్ సిటీలో స్టార్ సీక్రెట్ చర్మ సౌందర్య బ్రాండ్ పరిచయం చేస్తున్నందుకు ఎంతో సంతోషంగా వుందన్నారు.



స్టోర్‌ను ప్రారంభిస్తున్న ప్రముఖ నటి నిక్కీ గల్రానీ

ఏర్కాడులో అకాలవర్షం



ఉద్యానవనాల వద్ద షెల్టర్లలో తలదాచుకుంటున్న పర్యాటకులు

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): పేదల ఊటీగా పేరొందిన ఏర్కాడులో గురువారం సాయంత్రం ఉన్నట్టుండి భారీ వర్షం కురిసింది. గత నాలుగు నెలలుగా వర్షానికి నోచుకోని ఏర్కాడు ప్రాంతంలో ఇప్పటికే ఎండవేడికి పచ్చదనం కాస్త కనుమరుగైంది. వారం రోజులుగా ఏర్కాడును సందర్శించేందుకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగింది. అయితే పగటిపూట ఉష్ణోగ్రత అధికంగా ఉండటంతో పర్యాటకులు ఉదయం, సాయంత్రం వేళల్లోనే ఉద్యానవనాలు, బోట్ హౌస్ ప్రాంతాలను సందర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం చల్లటి గాలులతో చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం భారీగా కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. అప్పటి వరకు ఎండవేడి లోనే బోట్‌సవారీ చేస్తున్న పర్యాటకులు వానలో తడుస్తూ సందడి చేశారు. అన్నాగార్డెన్ తదితర ఉద్యానవనాలను సందర్శిస్తున్న పర్యాటకులు కూడా వర్షంలో తడుస్తూ నాట్యం చేస్తూ తాము బసచేసిన ప్రాంతాలకు వెళ్లారు. అరగంట సేపు కురిసిన ఈ వర్షానికి ఏర్కాడు అంతా చల్లటి వాతావరణం నెలకొంది. శుక్రవారం ఉదయం కూడా అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురిసాయి.

ఆళ్వారుపేటలో 'హస్తకళా ఉత్సవ్'



ప్రదర్శనలో వినియోగదారులు

చెన్నై, మే 3 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ఆళ్వారుపేట, టీటీకే రోడ్డులో వున్న శంకరా హాలు (మొయిన్)లో 'హస్తకళా ఉత్సవ్' ఏర్పాటైంది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత, హస్తకళాకారులు తమ ఉత్పత్తులను ఈ హస్తకళా ప్రదర్శనలో వుంచారు. ఇందులో ఒడిశా కాటన్, సిల్క్ చీరలు, వెస్ట్‌బెంగాల్ కాటన్ చీరలు, ఆంధ్ర కళంకారి చీరలు, ములహాముల్ చందేరి చీరలు, మదురై సుంగుడి చీరలు, లేడీస్ టాప్స్ తదితరాలున్నాయి. అలాగే రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ బెడ్‌రగ్స్, హ్యాండ్ మేడ్ జువెలరీ, కార్పెట్స్, మార్బుల్ క్రాఫ్ట్, రాజస్థాన్, ఒడిశా, తంజావూరు పెయింటింగ్‌లు ఇత్తడి కళారూపాలు, సహరన్‌పూర్ కొయ్య సామగ్రి, ఫ్యాన్సీ జ్యూవెలరీ, చెన్నపట్నం, ఏటికొప్పాక ఆట వస్తువులు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనను ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 9.30 గంటల వరకు వీక్షించవచ్చని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.


'నమ్మ యాత్రి' యాప్ సేవలు ప్రారంభం



యాప్ ప్రారంభోత్సవంలో యూనియన్ ప్రతినిధులు

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో అతిపెద్ద ఓపెన్ మొబిలిటీ యాప్ అయిన 'నమ్మ యాత్రి' చెన్నైలో తన సేవలను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు షాన్, టి.కోశి, ప్రముఖ యూనియన్ నాయకులు వి.కుప్పుస్వామి, ఎ.జాహిర్ హుస్సేన్, ఆర్.వెట్రివేల్, ఎస్.ముస్తఫా, వి.ఢిల్లీ బాబు, జి.సెల్వకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. నమ్మ యాత్రి ఓపెన్ డేటా, ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్‌తో 100 శాతం పారదర్శకతను నిర్ధారిస్తుందన్నారు. అంతేకాకుండా డ్రైవర్ల కోసం కనీస మద్దతు ధరని అమలు చేసిన మొదటి యాప్ అని వివరించారు.

మచ్చా..ఈయచ్చే గెలుస్తాడంటావా?



'మచ్చా రేయ్.....ఎవుర్రా వీళ్ళంతా?' వీధిలో జేజేలు పలుకుతూ వెళ్తున్న ఎన్నికల ప్రచారం బృందాన్ని చూస్తూ అడిగాడు సుబ్బయ్య. 'ఉత్తరా దోడంటనే.. ప్యానోళ్లు, సైకిలోళ్లతో పోటీపడి సందడి చేస్తావుండాడు' నవ్వుతూ టీ గ్లాసు అందుకున్నాడు రామయ్య. 'దుడ్లు బలే సెలవుజేస్తావుండారంటలే. బాగా వున్నోడంట మామా..' సుబ్బయ్య గొంతులో కాస్త అసూయ ధ్వనించింది. 'ఔను యా మామా.. ఎవరు ఎన్ని ఓట్లు ఏపిస్తారో అన్ని వేలు ఇచ్చేస్తా.. అని చెప్తున్నాడంటగదా?' ఆశగా అడిగాడు రామయ్యని. 'అవును మచ్చా.. ఆపార్టీలో, ఈపార్టీలో అలిగినోళ్లంతా ఎగబడి ఈయబ్బతో తిరగతావుండారంటలే. దుడ్లు దండిగా పడతావుళ్లా.' అని నవ్వాడు రామయ్య. 'అట్టయితే గెలిచిపోతాడంటావా?' అమాయకంగా అడిగాడు సుబ్బయ్య. పకపకా నవ్వి చెప్పాడు రామయ్య.. 'మామా మనూర్లో జనాలు యేమన్నా తెలివిమాలినోళ్లా యేమి.. దుడ్లు చేదా.. ఎవురిచ్చినా కాదనకుండా తీసుకుంటారు. ఎవరు పిలిచినా ప్రచారానికి పోతారు. ఓట్లదినం.. లోపలికి పొయ్యి ఎవరికి గుద్దాల్నో వాళ్లకు సైగ్గా గుద్దేసి వచ్చేస్తారు.'

- సత్యవేడు

ఇదీ మందుల


రండి.. రండి.. రండి.. దయచేయండి



పొట్టచేతపట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిపై రాజకీయ నాయకులకు ఎక్కడ లేని ప్రేమా పుట్టుకొచ్చింది. ఇన్నాళ్లూ వాళ్లెక్కడున్నారో తెలియకపోయినా, కనీసం ముఖ పరిచయం లేకపోయినా వారికి తెగ ఫోన్లు చేసేస్తున్నారు. హలో అన్నా.... తెలుసు కదా...13న ఓట్ల పండగ వుంది. తప్పకుండా రండి.. మీ ఓటు ఫలానా గుర్తుకు వేసి వెళ్ళండని అభ్యర్థిస్తున్నారు. బెంగళూరు, చెన్నై, విజయవాడ, విశాఖపట్నం, తదితర ప్రాంతాలకు వలస వెళ్ళిన వేలాది మంది జిల్లా ఓటర్లపై తిరుపతి నాయకులు దృష్టి పెట్టారు. స్థానికంగా ఇలాంటి వారి వివరాలు సేకరించి వరుస పెట్టి ఫోన్లు చేసి రప్పించే పనిలో బిజీగా ఉన్నారు. ముక్కూమొఖం చూడకపోయినా మాట కలిపి వీరు ఫోన్లో ప్రేమ ఒలకబోస్తున్నారు. ప్రతి ఓటూ కీలకంగా భావించిన పార్టీలు ఈ పనిని ప్రత్యేకించి స్థానికంగా కొందరికి అప్పగించాయి. వలస ఓటర్లను రకరకాలుగా ఆకర్షించి రప్పించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. బస్సు, రైళ్లలో రిజర్వేషన్లు చేసి టికెట్లు పంపుతున్నట్టు సమాచారం. నాయకుల నుంచి అదేపనిగా ఫోన్లు వస్తుండటంతో ఈ వలస జీవులు విస్తుపోతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం)

మా ఊర్లో మీ పెత్తనమేంటి!




ఎన్నికల ఇన్‌చార్జిల తీరు వైసీపీ లోకల్ కేడరుకు సుతరామూ నచ్చడం లేదు. మామీద మీ బోడి పెత్తనమేంటంటూ తిరుగుబాటు చేస్తున్నారు. ఎన్నికల కోసం రేణిగుంట మండలానికి వైసీపీ నాయకత్వం బయట ప్రాంతాలకు చెందిన ముగ్గురిని ఇటీవల మండల ఇన్‌చార్జిలుగా నియమించింది. అయితే వీరు స్థానికంగా ప్రతి పనిలోనే వేలు పెడుతున్నారంటూ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు గుర్రు మీదున్నారు. మీడియా వార్తల వల్ల గ్రాఫ్ పడిపోతోందని, తమకు చెప్పకుండా ఏ పనీ చేయకూడదని హుకుం జారీ చేయడాన్ని వీరు జీర్ణించుకోలేకపోతున్నారు. ఒకరిద్దరు చేసిన తప్పులను సాకుగా చూపుతూ సదరు ఇన్‌చార్జిలు అందరినీ దోషులుగా చూడడం అసలుకే మోసం వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అయినా స్థానికంగా అవగాహన ఉన్న తమను కాదని బయట వ్యక్తులను పరిశీలకులుగా నియమించడమేంటని మండిపడుతున్నారు. ఇలాంటి 'సారథు'లు విజయానికి కాకుండా ఓడించేలా వ్యవహరిస్తున్నారని తలపట్టుకుంటున్నారు. పార్ట్‌టైం పరిశీలకులకు,స్థానిక నాయకులకు మధ్య ఏర్పడిన అంతరం రోజురోజుకూ పార్టీకి తలనొప్పిగా తయారయింది.

- రేణిగుంట

పాదయాత్రే తనను నాయకుడిగా మలచిందని ఆయన చెబుతాడు. రాష్ట్రం దుస్థితి, ప్రజల కష్టాలు కళ్ల చూసిన తర్వాతనే వైసీపీ మేనిఫెస్టో రూపొందించానని అంటారు. నిజమేనా? నమ్మచ్చా? జగన్ మాటలకూ చేతలకూ నడుమ అగాధాలు ఉన్నాయనేందుకు సాక్ష్యమే ఈ కథనం..

జగన్ నడిచిన దారులు

ఇప్పుడిలా ఉన్నాయి



2018 జనవరి 10న చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలం అనుప్పల్లిలో జిల్లాలోకి ప్రవేశించిన జగన్.. నగరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల మీదుగా జనవరి 30న నెల్లూరు జిల్లాలోకి నడక సాగించారు. జిల్లాలో మొత్తం 184 కిలోమీటర్లు నడిచారు. ఎందరితోనో మాట్లాడారు. అధికారంలోకి రాగానే అన్నీ మార్చేస్తానంటూ హామీలెన్నో ఇచ్చారు. తలలు నిమిరి, నుదుట ముద్దులు పెట్టి, బుగ్గలు గిల్లి ఆయన చెప్పిన మాటలు నమ్మిన ప్రజలు ఒక్క ఛాన్స్ ఇచ్చారు. అంతే ఆ తర్వాత నడిచి వచ్చిన దారులనే జగన్ మరచిపోయారు. గాల్లో తప్ప నేలమీదకు దిగడం మానేశారు. మళ్లీ ఎన్నికలొచ్చాకే బస్సెక్కారు. మాట తప్పనూ, మడమ తిప్పనూ, చేసేదే చెబుతానూ.. అని వేదికలమీద దబాయించి అబద్ధాలు చెప్పే ఈ నాయకుడి పాలనలో అభివృద్ధి ఎలా ఉందో ఆయన నడిచిన దారులే సాక్ష్యం. పాదయాత్ర సమయంలో సవ్యంగా ఉన్న ఈ రోడ్లు ఇప్పుడు ఇలా ఉన్నాయి...

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వైసీపీ పాలనకు అద్దం పడుతూ దుస్థితిలో రోడ్లు

నియోజకవర్గం: సత్యవేడు



బుచ్చినాయుడు కండ్రిగ మండలం పల్లమాల నుంచీ ఆలత్తూరు వరకూ శిథిలమైన రోడ్డు

పాదయాత్ర: 2018 జనవరి 22

నడిచిన గ్రామాలు: బుచ్చినాయుడు కండ్రిగ మండలం చల్లమాంబపురం, పార్లపల్లి, పల్లమాల, ఆలత్తూరు.

నడిచిన దూరం: 15 కిలోమీటర్లు

జగన్ నడిచిన రోడ్లు స్థితి: పల్లమాల నుంచీ ఆలత్తూరు వరకూ ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్వహణకు, మరమ్మతులకు నోచుకోక దారుణంగా తయారైంది. కంకర, మట్టి తప్ప తారు రోడ్డన్నదే కనిపించడం లేదు. ఈ మార్గంలో ప్రయాణానికి వాహనదారులు నరకం చూస్తున్నారు.

నియోజకవర్గం: శ్రీకాళహస్తి



ఏర్పేడు మండలం మడిబాక నుంచీ రాజుల కండ్రిగ వరకూ రోడ్డు అధ్వానంగా వున్న దృశ్యం

పాదయాత్ర: 2018 జనవరి 16 నుంచీ 22 వరకు

నడిచిన మండలాలు: ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు

నడిచిన దూరం: 42 కిలోమీటర్లు

జగన్ నడిచిన రోడ్ల స్థితి: మడిబాక నుంచీ రాజుల కండ్రిగ వరకూ ఒకటిన్నర కిలోమీటరు, సదాశివపురం నుంచీ మోదుగులపాలెం వరకూ నాలుగున్నర కిలోమీటర్ల దూరం, అలాగే కోబాక నుంచీ ఏర్పేడు దాకా మూడు కిలోమీటర్లు రోడ్డు పరమ అధ్వానంగా ఉన్నాయి.

ఏర్పేడు మండలం సదాశివపురం నుంచీ మోదుగులపాలెం నడుమ రోడ్డు దెబ్బతిన్న దృశ్యం

నియోజకవర్గం: నగరి



పాదయాత్ర తేదీలు: 2018 జనవరి 14 నుంచీ 16 వరకు

నడిచిన గ్రామాలు: వడమాలపేట మండలం పత్తిపుత్తూరు, అప్పలాయగుంట, ఎనమలపాలెం, తిరుమణ్యం, వడమాలపేట, పాదిరేడు, టీసీ అగ్రహారం.

నడిచిన దూరం: 18 కిలోమీటర్లు

జగన్ నడిచిన రోడ్ల స్థితి: పరమ అధ్వానంగా వున్నాయి. ఎనమలపాలెం నుంచీ తిరుమణ్యం వరకూ తీవ్ర దుస్థితిలో వుంది.

వడమాలపేట మండలం ఎనమలపాలెం నుంచీ తిరుమణ్యం వరకూ రోడ్డు దుస్థితి.

నియోజకవర్గం: సూళ్ళూరుపేట

పాదయాత్ర: 2018 జనవరి 23 నుంచీ 26 వరకు

నడిచిన మండలాలు: పెళ్ళకూరు, నాయుడుపేట, ఓజిలి

నడిచిన దూరం: 45 కిలోమీటర్లు

జగన్ నడిచిన రోడ్లు స్థితి: శిరసనంబేడు రాజుపాలెం నుంచీ చావలి చెక్‌పోస్టు వరకూ ఆరు కిలోమీటర్ల దూరం భారీ గోతులు ఏర్పడ్డాయి. తారు, కంకర పూర్తిగా తొలగిపోయి మట్టిరోడ్డుగా మారింది. దుమ్ము రేపుతూ వాహనదారులకు నరకం చూపుతోంది.



పెళ్ళకూరు మండలం శిరసనంబేడు రాజుపాలెం నుంచీ చావలి చెక్‌పోస్టు నడుమ మట్టిరోడ్డుగా మారిన తారు రోడ్డు.

నియోజకవర్గం: గూడూరు

పాదయాత్ర: 2018 జనవరి 27 నుంచీ 29 వరకూ

నడిచిన గ్రామాలు: గూడూరు మండలం కాండ్ర, తిమ్మసముద్రం, కొండాగుంట, ఆరిచెర్ల, గాంధీనగర్, మాలవ్యనగర్, గూడూరు, నెల్లకూరు, చెన్నూరు, తిప్పవరప్పాడు.

నడిచిన దూరం: 24 కిలోమీటర్లు

జగన్ నడిచిన రోడ్లు స్థితి: నెల్లకూరు నుంచీ చెన్నూరు వరకూ నాలుగు కిలోమీటర్ల పొడవునా రోడ్డు అధ్వానంగా మారింది. తారు, కంకర లేచిపోయి వెడల్పాటి గోతులు ఏర్పడి వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి.



నెల్లకూరు నుంచీ చెన్నూరు నడుమ ఛిద్రమైన రోడ్డు

నోట్ దిస్ పాయింట్

అక్కడ ఓటు వేయకపోతే నేరమే!

ప్రజాస్వామ్యంలో ఓటు అన్నది పౌరుల హక్కు అని చెబుతారు. నిజానికి ఓటు అన్నది పౌరుల బాధ్యత కూడా. నాయకులంతా ఇంతే.. నేనెందుకు ఓటు వేయాలి అని మనదేశంలో చాలామంది ఓటు వేయడానికి ఇష్టపడరు. అందుకే పోలింగ్ శాతం 60 శాతం నమోదవుతూ ఉంటుంది. కొన్ని దేశాల్లో ఓటు వేయకపోవడాన్ని నేరంగా పరిగణిస్తారు. ఆస్ట్రేలియాలో ఓటు వేయకుంటే చిన్నపాటి నేరమే. అందుకు తగ్గ కారణం, అక్కడ ప్రభుత్వానికి చూపించాల్సిందే. లేదంటే రూ.1000 జరిమానా చెల్లించాలి. లేకపోతే నేరస్తుడిగా పరిగణిస్తారు. అర్జెంటీనాలో ఓటు వేయనివారికి సంవత్సర కాలంపాటు ప్రభుత్వ పథకాలు తొలగిస్తారు. పెరూ దేశంలో ఓటు వేయని వారికి పెద్దశిక్షలు అమలు చేస్తారు. వారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తారు. బెల్జియంలో ఓటు హక్కు వినియోగించుకోని వారిని కోర్టులో హాజరుపరుస్తారు. నాలుగు పర్యాయాలు ఓటు వేయనివారికి పదేళ్లపాటు ఓటు హక్కు రద్దు చేస్తారు. ఈ కారణంగా ఓటు వేయని వారు ప్రభుత్వ ఉద్యోగ అర్హత కోల్పోతారు. గ్రీస్, ఈజిప్టు దేశాల్లో ఓటుహక్కు వినియోగించుకోని వారిని కోర్టులో హాజరుపరుస్తారు. న్యాయస్థానంలో సరైన కారణం చూపని వారిని జైలుకు పంపుతారని ఆయా దేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు అంటున్నారు. మన దేశంలో కూడా వందశాతం పోలింగ్ అయ్యేందుకు ఇలాంటి చట్టాలు ఎప్పుడు వస్తాయో వేచి చూడాల్సిందే.

- గూడూరు అర్బన్



ఓటు ఎక్కడుందో తెలుసుకోండిలా..

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ గడువు దగ్గరకొస్తోంది. చాలామందిలో ఓటు ఎక్కడ ఉంది..? ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాలి? లాంటి సందేహాలుంటాయి. వీటిని నివృత్తి చేసేందుకు తిరుపతి కలెక్టరేట్‌లో అధికారులు కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. 1950 నంబరుకు ఫోన్ చేసి ఓటరు పేరు, నియోజకవర్గం, కార్డు నెంబరు(ఎపిక్ నెంబర్) చెబితే పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. 0877-2236007 నంబరుకు ఫోన్ చేసినా ఈ సమాచారం అందిస్తారు. ఎన్నికల ప్రవర్తనావళి ఉల్లంఘనలు, రాజకీయ పార్టీ నేతల ప్రలోభాలు, తాయిలాలు లాంటి సమాచారం ఈ నంబరుకు తెలియజేయవచ్చు. మొబైల్ ఫోన్‌లో 1950ఈసీఐ అని టైప్ చేసి స్పేస్ ఇచ్చి ఓటరుకార్డు(ఎపిక్)నెంబరు నమోదు చేస్తే కొద్ది సమయంలో పేరు,బూత్ నెంబరు, ఓటు సీరియల్ నెంబరు వివరాలతో సహా సంక్షిప్త సమాచారం వస్తుంది. ఓటర్ హెల్ప్‌లైన్ అనే యాప్‌లోనూ ఫోన్ నంబరు, ఎపిక్ నెంబర్‌తో వివరాలు తెలుసుకోవచ్చు.

- తిరుపతి (కలెక్టరేట్)

మత్స్యకారులకు కిలివేటి వల

● మూణ్ణాళ్ల ముచ్చటగా తమిళ పాఠశాల

మేం అధికారంలోకి వస్తే పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం... తమిళ పాఠశాలను ఏర్పాటు చేస్తాం...

2019 ఎన్నిలకు ముందు వైసీపీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తడ మండలం ఇరకందీవి పాళెంతోపుకుప్పంలో మత్స్యకారులకు ఇచ్చిన హామీ ఇది.

ఇరకందీవిలోని పాళెంతోపు కుప్పంలో తమిళ పాఠశాల ఏర్పాటు మూణ్ణాళ్ల ముచ్చటే అయింది. ఎన్నికల్లో గెలిచాక 2019 సెప్టెంబరు 16న అధికారపార్టీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, అప్పటి సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బ్రహ్మానందరెడ్డి, ఇతర అధికారులను వెంటబెట్టుకుని పాళెంతోపు కుప్పం వెళ్లారు. ఆదరాబాదరాగా తమిళ పాఠశాలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించి రిబ్బన్ కట్ చేశారు. ఇక్కడున్న 45 మంది విద్యార్థుల చదువుల కోసం ఇద్దరు తమిళ విద్యావలంటీర్లను నియమించినట్లు ఆయన చెప్పారు. త్వరలోనే తమిళ మీడియం రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇచ్చారు. ఇక పడవల్లో తమిళనాడు పాఠశాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. అంతటితో ఆగకుండా వచ్చే విద్యాసంవత్సరానికి పిల్లలంతా ఇక్కడే తమిళ మీడియంలో చదువుకునేలా రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తాన్నారు. దాంతో ఆ రోజు మత్స్యకార కుటుంబాలు సంతోషంలో మునిగి తేలిపోయాయి. కానీ వారి ఆనందం పట్టుమని పది రోజులు కూడా నిలవలేదు. విద్యావలంటీర్లు పది రోజులుగా జారుకున్నారు. శాశ్వత ఉద్యోగులను నియమిస్తామన్న ఎమ్మెల్యే మాట నెరవేరలేదు. దీంతో నెలరోజుల్లోనే పాఠశాల మూతపడింది. ఎమ్మెల్యే సంజీవయ్య తమ చెవిలో పువ్వు పెట్టారని ఇరకం కుప్పం గ్రామస్తులు గుర్తించారు. ఎప్పటిలాగే ఇక్కడి పిల్లలు ఉస్సూరంటూ పడవలో తమిళనాడు పాఠశాలకు వెళ్తున్నారు.

- తడ



పాళెంతోపుకుప్పంలో అధికారులు ఏర్పాటు చేసిన తమిళ పాఠశాల